aruhi
aruhi group
BBTV
BBTV TELUGU
BBTVNETWORK

తెలుగు దినపత్రిక
నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
మంగళవారం
27-01-2026 సంపుటి : 01 సంచిక : 2 పేజీలు : 08 వెల : ₹ 5/- RNI NO : TGTEL/26/A0738
Published From HYDERABAD,VIJAYAWADA తెలంగాణ , ఆంధ్రప్రదేశ్. www.mahaaprabha.com MAHAAPRABHA.DAILY

BESQATI
www.besqati.com
besqati.com
Contact : info@besqati.com






# అంబరాన్నంటిన గణతంత్ర వేడుకలు

## జాతీయ జెండాను ఆవిష్కరించిన రాష్ట్రపతి ముర్ము

- ఆకట్టుకున్న సైనిక శకట ప్రదర్శన
- ప్రత్యేక ఆకర్షణగా ఆపరేషన్ సిందూర్ ఆయుధ వ్యవస్థలు
- ప్రత్యేక ఆకర్షణగా మోడీ తలపాగా
- ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులాతో మోడీ
- పరేడ్ వివరాలను ఎప్పటికప్పుడు వివరిస్తూ కనిపించిన ప్రధాని
- ముఖ్య అతిథులుగా ఆంటోనియో కోస్టా, ఉర్సులా వాన్‌డెర్ లేయెన్




**న్యూఢిల్లీ, – జనవరి 26 (మహాప్రభ )**
దేశ రాజధాని ఢిల్లీలో గణతంత్ర వేడుకలు అంబరాన్నంటాయి. ఉదయం 10.30 గంటలకు కర్తవ్యపథ్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సైనిక దళాల కవాతు ప్రారంభమైంది. అపాచీతో పాటు ప్రచండ్ తేలికపాటి హెలికాప్టర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పోరులో ధరించే దుస్తులతో అశ్వికదళం తొలిసారి ఈ పరేడ్‌లో పాల్గొంది. ఐరోపా సమాఖ్యకు చెందిన సైనిక విభాగం కూడా ప్రదర్శనలిచ్చింది. దేశ అభివృద్ధి ప్రస్థానం, సాంస్కృతిక వైవిధ్యం, సైనిక బలం, ఆపరేషన్ సిందూర్‌లో వాడిన ప్రధాన ఆయుధ వ్యవస్థలు వంటివి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకలకు యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లేయెన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ వేడుకలను వీక్షించేందుకు వేలాది మంది విచ్చేశారు.

-మిగతా 3 లో







# రాజ్యాంగాన్ని కాలరాసిన ఇందిర

- అదేబాటలో కాంగ్రెస్ పాలకులు
- బీజేపీ కార్యాలయంలో జెండా ఎగరేసిన రామ్

**హైదరాబాద్,– జనవరి 26 (మహాప్రభ )**
రాజ్యాంగంలో కల్పించిన మౌలిక హక్కులను మాజీ ప్రధాని ఇందిరాగాంధీ కాలరాశారని.. ఇందిరా, రాజీవ్ గాంధీల బాటలోనే రాహుల్ గాంధీ నడుస్తున్నారని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు విమర్శించారు. భారతీయులకు మాత్రమే ఓటు హక్కు ఉండాలని... ఇతర దేశాలకు చెందిన వారికి ఓటు హక్కు ఎలా కల్పిస్తారని ప్రశ్నించారు. తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు

-మిగతా 3 లో

## తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్‌తో

# పెరిగిన ఇమేజ్

## గణతంత్ర దినోత్సవంలో గవర్నర్ జిష్టుదేవ్ వర్మ

- మూడు ఎకనమిక్ జోన్లుగా రాష్ట్ర విభజన
- సర్వతో ముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి
- మేడారం అభివృద్ధి కోసం రూ.251కోట్లు కేటాయింపు
- 26 లక్షల మంది రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ
- ధాన్యానికి బోనస్‌గా రైతులకు రూ.1,780కోట్లు అందచేత
- రిపబ్లిక్ డే వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్ బాబు తదితరులు హాజరు



**హైదరాబాద్, – జనవరి 26 (మహాప్రభ )**
భిన్నత్వంలో ఏకత్వం మన ప్రత్యేకత అని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని గవర్నర్ ఎగరవేశారు.పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.అనంతరం రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ప్రజా ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించిందని..

-మిగతా 3 లో



## భారత్ నూలుపై సుంకాలు

# విధించాల్సిందే

- బంగ్లా వస్త్రవ్యాపారుల డిమాండ్
- లేదంటే ఫిబ్రవరి 1 నుంచి కర్మాగారాలు మూసివేస్తామని బంగ్లా ప్రభుత్వాన్ని హెచ్చరిక

**ఢాకా,- జనవరి 26 (మహాప్రభ )**
బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథిగా మహమ్మద్ యూనస్ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి భారత్-బంగ్లాల మధ్య దౌత్య, వాణిజ్య సంబంధాలు వేగంగా క్షీణిస్తూ వచ్చాయి. మరోవైపు ఆ దేశంలోని హిందువులపై దాడులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత్‌కు వ్యతిరేకంగా అక్కడి వస్త్ర పరిశ్రమ వర్గాలు మరో డిమాండ్‌ను తెర పైకి తీసుకువచ్చాయి. ఇప్పటివరకు భారత నూలుకు బంగ్లాదేశ్‌లో ఉన్న డ్యూటీ-ఫ్రీ సౌకర్యం తొలగించాలని పట్టుబట్టాయి. లేదంటే ఫిబ్రవరి 1 నుంచి కర్మాగారాలు మూసివేస్తామని బంగ్లా ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. ఈ మేరకు ఆ దేశ వాణిజ్యశాఖ నుంచి నేషనల్ బోర్డ్ ఆఫ్ రెవెన్యూకు లేఖ అందినట్లు యూనస్ ప్రభుత్వం పేర్కొంది. జనవరి చివరి నాటికి భారత నూలుకు సుంకం లేని దిగుమతి సౌకర్యాన్ని ఉప సంహరించుకోకపోతే దేశవ్యాప్తంగా అన్ని స్పిన్నింగ్ యూనిట్లలో కార్యకలాపాలు నిలిపేస్తామని

-మిగతా 3 లో

# అమరావతిలో తొలిసారిగా జెండా వందనం

- ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మైదానంలో పరేడ్
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితోపాటు ఆయన సతీమణి నారా భువనేశ్వరి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు హాజరు



**అమరావతి,- జనవరి 26 (మహాప్రభ )**
ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో తొలిసారిగా 77వ గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ జాతీయ జెండాను ఎగరవేశారు. హైకోర్టు సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మైదానంలో ఈ వేడుకలు నిర్వహించారు. రిపబ్లిక్ డే వేడుకలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితోపాటు ఆయన సతీమణి నారా భువనేశ్వరి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు, పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు. జెండా ఆవిష్కరణ

-మిగతా 3 లో

## స్వాతంత్ర ఉద్యమ

# చరిత్ర లేని బిజెపి

- ఉపాధిలో గాంధీ పేరును తొలగించారు
- ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కిన ఘనత బీజేపీది
- గాంధీభవన్‌లో జెండా ఆవిష్కరణలో పీసీసీ చీఫ్




3 లో


## ఫోన్ ట్యాపింగ్ కేసులో

# మరో కీలక పరిణామం

- బీఆర్ఎస్ మాజీ ఎంపీ సంతోష్‌కు సిట్ నోటీసులు
- 27వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జుబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయంలో స్వయంగా హాజరు కావాలని నోటీసులు



3 లో



# భారత్ ఎఫెక్ట్

- పాకిస్తాన్‌కు షాకిచ్చిన యూఏఈ..
- కీలక ఒప్పందం రద్దు

**న్యూఢిల్లీ– జనవరి 26 (మహాప్రభ )**
అంతర్జాతీయంగా ఇండియా ఎంత పవర్‌ఫుల్లో చెప్పడానికి ఈ ఘటన ఒక నిదర్శనం. యూఏఈ ప్రెసిడెంట్ ఇండియా టూర్ ముగించుకుని వెళ్లిన వారం రోజుల్లోనే పాకిస్తాన్‌కు షాకిచ్చారు. పాకిస్తాన్‌తో చేసుకున్న ఎయిర్‌పోర్ట్ ఒప్పందాన్ని యూఏఈ రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించింది. అయితే, ఈ డీల్ రద్దుకు భారత్‌తో యూఏఈ కుదుర్చుకున్న ఒప్పందమే కారణం అనే ప్రచారం జరుగుతోంది. గత వారం యూఏఈ ప్రెసిడెంట్ షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ ఇండియాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఇండియాలో ఆయన మూడు గంటలు మాత్రమే ఉన్నారు. ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. కానీ, ఈ మూడు గంటల్లోనే

-మిగతా 3 లో

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బొందపెట్టాలి



- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ధృతరాష్ట్రపాత్ర
- బీఆర్ఎస్‌లో చేరిన పలువురు చేవెళ్ల నేతలు
- పేద ప్రజలకు న్యాయం జరగాలంటే కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలి
- కార్యకర్తలకు కేటీఆర్ పిలుపు

**హైదరాబాద్, – జనవరి 26 (మహాప్రభ )**
స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ధృతరాష్ట్రపాత్ర పోషిస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మహాభారతంలో ధృతరాష్ట్రుడికి ఏమీ కనిపించనట్లు.. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో సభాపతి అలానే వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలని రాష్ట్ర ప్రజలకు కేటీఆర్ పిలుపునిచ్చారు.

-మిగతా 3 లో

నమస్తే మహాప్రభ

# వివాదంలో చైనా ఉన్నత సైన్యాధికారి

## అణ్వాయుధ రహస్యలు లీక్ చేశారన్న ఆరోపణలు



**బీజింగ్, – జనవరి 26 (మహాప్రభ )**
చైనాలో అత్యంత శక్తిమంతమైన సైనికాధికారి ఒకరు అవినీతి, రహస్యాల చేరవేత వివాదంలో ఇరుక్కున్నారు. అవినీతితో పాటు కీలకమైన అణ్వాయుధాల రహస్యాలను అగ్రరాజ్యానికి లీక్ చేశారన్న ఆరోపణలు రావడంతో ఆయనపై దర్యాప్తు మొదలైనట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ వార్త చైనా మిలిటరీలో తీవ్ర చర్చనీయాంశమైంది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు సన్నిహితుడైన జనరల్ జాంగ్ యూక్సియా.. ప్రస్తుతం ఆ దేశ సెంట్రల్ మిలిటరీ కమిషన్ వైస్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీలో అత్యున్నత స్థాయి అధికారి కూడా అయిన ఆయన, ఇలాంటి ఆరోపణలు ఎదుర్కోవడంతో తీవ్ర చర్చగా మారింది. ఇటీవల జాంగ్‌పై అమెరికా పత్రిక వాల్‌స్ట్రీట్ జర్నల్ సంచలనాత్మక కథనం ప్రచురించింది. చైనా అణ్వాయుధ ప్రోగ్రామ్‌కు సంబంధించిన కీలక సాంకేతిక డేటాను జాంగ్ అమెరికాకు లీక్ చేశారన్నది దాని సారాంశం. చైనీస్ మిలిటరీలోని ఉన్నతస్థాయి వర్గాలను ఉటంకిస్తూ వాల్‌స్ట్రీట్ జర్నల్ ఆ కథనం రాసింది. అంతేకాదు.. ప్రమోషన్ల విషయంలో జాంగ్ యూక్సియా పెద్దఎత్తున లంచాలు తీసుకున్నాడని, కిందిస్థాయి ఉద్యోగులపై వేధింపులు, ఆయుధ పరికరాల కొనుగోళ్లలో అవినీతికి పాల్పడ్డాడని ఆయనపై ఆరోపణలు వచ్చినట్లు ఆ కథనం తెలిపింది. దీంతో చైనా రక్షణ మంత్రిత్వశాఖ ఆయనపై ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించినట్లు పేర్కొంది. అవినీతి నిర్మూలనకు చైనా కమ్యూనిస్ట్ పార్టీ చేపట్టిన కఠిన చర్యల్లో భాగంగానే జాంగ్‌పై దర్యాప్తు జరుగుతోందని వాషింగ్టన్‌లోని చైనా ఎంబసీ అధికార ప్రతినిధి చెప్పినట్లు ఆ కథనం తెలిపింది. అయితే, దీనిపై చైనా నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటనేదీ రాలేదు. ఇదిలాఉండగా.. ఈ కథనం తర్వాత సామాజిక మాధ్యమాల్లో జాంగ్‌పై మరిన్ని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌కు వ్యతిరేకంగా సైనిక తిరుగుబాటుకు ప్రయత్నం జరిగిందనే ప్రచారం జోరందుకుంది. ఈ క్రమంలోనే జాంగ్‌తో పాటు మరికొంతమంది సీనియర్ జనరల్స్‌ను నిర్బంధించినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే, వీటిని చైనా అధికారులు గానీ.. పశ్చిమదేశాల నిఘా సంస్థలు గానీ ధ్రువీకరించలేదు. దీంతో ఇది చర్చగానే సాగుతోంది.

# రిపబ్లిక్ డే పరేడ్‌లో.. హైలైట్‌గా 'ఆపరేషన్ సిందూర్' శకటం




**న్యూఢిల్లీ:– జనవరి 26 (మహాప్రభ )**
భారత దేశ 77వ రిపబ్లిక్ డే పరేడ్‌లో 'ఆపరేషన్ సిందూర్' శకటం ప్రత్యేకంగా ఆకట్టుకున్నది. దేశ త్రివిధ దళాల సంయుక్త శక్తి సామర్థ్యాలను ఇది ప్రతిబింబించింది. ఆపరేషన్ సిందూర్‌లో (రాజూ రాఅఅసశీశీ ఖఎశ్రీముబ) ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ దళాలు ఎలా ఐక్యంగా పనిచేశాయో ఈ శకటం ద్వారా ప్రదర్శించారు. క్షిపణులు, ట్యాంకులు, ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ ప్రతిరూపాలతో దీనిని తీర్చిదిద్దారు. బ్రహ్మోస్ క్రూయిజ్ క్షిపణులు, ఆకాశ్ వైమానిక రక్షణ వ్యవస్థలు, సుదర్శన చక్రగా అభివర్ణించే ఎస్–400 యూనిట్ల ప్రతిరూపాలను ప్రదర్శించారు. పెరుగుతున్న భద్రతా సవాళ్ల మధ్య సైనికపరంగా దేశ సంసిద్ధతపై స్పష్టమైన సందేశాన్ని ఇది ఇచ్చింది. దేశ సైనిక బలగాల ఉమ్మడి యుద్ధ సామర్థ్యాన్ని ఆపరేషన్ సిందూర్ శకటం చాటింది.కాగా, గత ఏడాది ఏప్రిల్‌లో జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో పర్యాటకులతో సహా 26 మంది మరణించారు. దీనికి ప్రతికారంగా గత ఏడాది మే 7న 'ఆపరేషన్ సిందూర్' పేరుతో సైనిక చర్యను భారత్ చేపట్టింది. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)తో పాటు పాకిస్థాన్ సరిహద్దులోని ఉగ్రవాద శిబిరాలను భారత త్రివిధ దళాలు ధ్వంసం చేశాయి. వంద మందికిపైగా ఉగ్రవాదులు హతమయ్యారు. మరోవైపు ఈ సందర్భంగా పాక్ సైన్యం కవ్వింపులకు దిగింది. భారత సైనిక దళాలు ధీటుగా జవాబిచ్చాయి. పాక్‌కు చెందిన కీలక ఎయిర్‌బేస్‌లను ధ్వంసం చేశాయి. దీంతో గత ఏడాది మే 10న పాకిస్థాన్ ఆర్మీ కాళ్లబేరానికి వచ్చింది. భారత్‌తో కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్నది.

# అమెజాన్‌లో 16,000 మందిపై వేటు!

## రిస్క్‌లో బెంగళూరు, హైదరాబాద్, చెన్నైల్లోని ఉద్యోగులు




**వాషింగ్టన్, – జనవరి 26 (మహాప్రభ )**
: టెక్ దిగ్గజం 'అమెజాన్' మరో దఫా పెద్ద ఎత్తున ఉద్యోగాల తొలగింపును చేపడుతున్నది. మంగళవారం దాదాపు 16,000 మందిని ఉద్యోగాల నుంచి తొలగించేందుకు రంగం సిద్ధం చేసింది. అమెజాన్ వెబ్ సర్వీసులు, ప్రైమ్ వీడియో సహా వివిధ విభాగాల్లో పనిచేస్తున్న భారతీయ ఉద్యోగులపై, ముఖ్యంగా బెంగళూరు, హైదరాబాద్, చెన్నైల్లో పనిచేస్తున్న వారిపై తీవ్ర ప్రభావం పడుతున్నట్టు వార్తలు వెలువడ్డాయి. జూన్ 2026 నాటికి సంస్థలోని 30 వేల మంది ఉద్యోగులపై వేటు వేసేందుకు అమెజాన్ సిద్ధమవుతున్నది.బ్లిండ్, రెడిట్ సహా పలు సోషల్‌మీడియా వేదికలపై అమెజాన్ ఉద్యోగులు వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. భారత్‌లోని వివిధ నగరాల్లో పనిచేస్తున్న అమెజాన్ ఉద్యోగులంతా రిస్క్‌లో ఉన్నట్టు తెలుస్తున్నది. అమెజాన్ 2025లో రీస్ట్రక్చరింగ్ డ్రైవ్ పేరుతో ఉద్యోగాల తొలగింపును చేపట్టింది. తొలి దశలో భాగంగా గత ఏడాది అక్టోబర్‌లో 14 వేల మందిని విధుల నుంచి తొలగించింది.

# ప్రతి 20 నిమిషాలకు ఓ భారతీయుడి అరెస్ట్

## అమెరికా బోర్డర్ డాటా వెల్లడి



**వాషింగ్ట– జనవరి 26 (మహాప్రభ )**
అమెరికాలోకి అక్రమంగా ప్రవేశిస్తూ అక్కడి సరిహద్దుల్లో ప్రతి 20 నిమిషాలకు ఓ భారతీయుడు అరెస్ట్ అవుతున్నట్టు అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ విభాగం వెల్లడించింది. రోజుకు 65 మంది భారతీయులు అరెస్ట్ అవుతున్నట్టు తెలిపింది. అయితే 2024తో పోలిస్తే 2025లో ఈ సంఖ్య కాస్త తగ్గినట్టు పేర్కొన్నది. 2024లో 85,119 మందిని అరెస్ట్ చేయగా, 2025లో 23,830 మందిని అరెస్ట్ చేసినట్టు తెలిపింది.అక్రమ వలసలకు భారత్ ప్రధాన దేశంగా నిలుస్తున్నదని ఈ నివేదిక ఆరోపించింది. అడ్డుకున్న భారతీయుల్లో అత్యధికులు ఉద్యోగం, మెరుగైన వేతనాల కోసం వచ్చిన వాళ్లే ఉన్నారని, కఠినమైన విధానాలు అక్రమ చొరబాట్లను గణనీయంగా తగ్గించగలిగినట్టు పేర్కొన్నది. దీంతో చొరబాటుదారులు అత్యంత ప్రమాదకరమైన మార్గాల్ని ఎంచుకుంటున్నారని నివేదిక తెలిపింది.

# డ్రాగన్, ఏనుగు కలిస నృత్యం చేయాలి

## రిపబ్లిక్ డే సందేశంలో జిన్‌పింగ్



**న్యూఢిల్లీ – జనవరి 26 (మహాప్రభ )**
భారతదేశ 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా చైనా అధ్యక్షుడు జీ జీన్‌పింగ్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు అభినందన సందేశం పంపారు. ఈ సందేశంలో 'చైనా భారత్ మంచి స్నేహం కలిగిన పొరుగు దేశాలుగా ఉండడం సరైన ఎంపిక అయి ఉండాలి. విజయం సాధించడానికి ఒకరికొకరు సహాయపడే భాగస్వాములుగా ఉండాలి. డ్రాగన్, ఏనుగు కలిసి నృత్యం చేయాలి' అని జిన్‌పింగ్ భారత్‌లోని చైనా జు ఫీహాంగ్‌కి షేర్ చేసిన పోస్టులో పేర్కొన్నారు.

# బద్రినాథ్, కేదార్‌నాథ్ ఆలయాల్లో హిందుయేతరులపై నిషేధం!

## ఆలయ కమిటీ ప్రతిపాదన



**న్యూఢిల్లీ, – జనవరి 26 (మహాప్రభ )**
ఉత్తర భారతంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన బద్రినాథ్, కేదార్‌నాథ్ ఆలయాల్లోకి ఇకపై హిందువులను మాత్రమే అనుమతించాలని బద్రినాథ్–కేదార్‌నాథ్ ఆలయ కమిటీ నిర్ణయించింది.గంగోత్రి, ముక్బా, బద్రినాథ్, కేదార్‌నాథ్ సహా బీకేటీఎస్ ఆధ్వర్యంలోని అన్ని ఆలయాల్లో హిందూయేతరుల ప్రవేశంపై నిషే ధం విధించాలని ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ మేరకు చేపట్టిన తీర్మానాన్ని ఆదివారం బీకేటీఎస్ ఆలయ కమిటీ ఏకగ్రీవంగా ఆమోదించింది. త్వరలో జరగబోయే బోర్డు సమావేశంలో ఈ ప్రతిపాదనలకు ఆమోదం లభించనున్నది.

# స్ఫూర్తిదాయకంగా కీరవాణి 'వందే మాతరం'



**న్యూఢిల్లీ – జనవరి 26 (మహాప్రభ )**
: ఆస్కార్ విజేత ఎంఎం కీరవాణి సరికొత్తగా రూపొందించిన 'వందే మాతరం' గేయం గణతంత్ర దినోత్సవాల్లో మారుమోగింది. న్యూఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో సోమవారం జరిగిన కవాతులో ఆయన నేతృత్వంలో దాదాపు 2,500 మంది కళాకారులు ఈ గేయాన్ని ఆలపించారు. ఈ 'వందే మాతరం' గేయం ఆహూతుల్లో భావోద్వేగాన్ని నింపింది. విభిన్న సంస్కృతుల మేళవింపుగా ఈ ప్రదర్శన జరిగింది. గణతంత్ర దినోత్సవ కవాతుకు సంగీతం సమకూర్చడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానని కీరవాణి ఎక్స్ వేదికగా చెప్పారు.


# అధ్యక్షుడి భారత పర్యటన తర్వాత.. పాక్ ఎయిర్‌పోర్ట్ ఒప్పందం రద్దు చేసిన యూఏఈ



**అబుదాబి – జనవరి 26 (మహాప్రభ )**
పాకిస్థాన్‌కు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) షాక్ ఇచ్చింది. ఆ దేశ అధ్యక్షుడి భారత పర్యటన తర్వాత కీలక నిర్ణయం తీసుకున్నది. ఇస్లామాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్వహించే ప్రతిపాదనను యూఏఈ విరమించుకున్నది. 2025 ఆగస్ట్ నుంచి చర్చలు జరుగుతున్న ఈ ఒప్పందాన్ని రద్దు చేసుకున్నది. యూఏఈ తీసుకున్న ఈ కీలక నిర్ణయాన్ని పాకిస్థాన్ దినపత్రిక 'ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్' ధృవీకరించింది. ఎయిర్‌పోర్ట్ కార్యకలాపాల అవుట్‌సోర్స్ భాగస్వామిని గుర్తించకపోవడంతో నిర్వహణ ప్రణాళికను యూఏఈ రద్దు చేసినట్లు పేర్కొంది.కాగా, మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తతలు నెలకొన్న తరుణంలో యూఏఈ అధ్యక్షుడు అల్ నహ్యాన్ జనవరి 19న భారత్‌లో ఆకస్మికంగా పర్యటించారు. ప్రధాని మోదీ ప్రత్యేక ఆహ్వానం మేరకు రెండు గంటల పర్యటనకు కుటుంబ సమేతంగా విచ్చేశారు. భారత్‌తో పలు కీలక ఒప్పందాలు చేసుకున్నారు. మరోవైపు యూఏఈ అధ్యక్షుడిగా అల్ నహ్యాన్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత భారత్‌లో పర్యటించడం ఇది మూడోసారి. గత పదేళ్లలో ఐదో పర్యటన కావడం విశేషం. యూఏఈ అధ్యక్షుడి ఆకస్మిక భారత పర్యటన తర్వాత కీలకమైన పాకిస్థాన్ విమానాశ్రయ ఒప్పందాన్ని ఆ దేశం రద్దు చేయడం విశేషం.

# 2027లో అదనంగా 50,000 గ్రీన్ కార్డ్‌లు

## 75 దేశాలకు ఇమిగ్రెంట్ వీసా ప్రాసెస్ నిలిపేయడమే కారణం!




**న్యూఢిల్లీ – జనవరి 26 (మహాప్రభ )**
అమెరికా వచ్చే ఏడాదిలో ఎంప్లాయ్‌మెంట్ బేస్డ్ గ్రీన్ కార్డ్‌లను అదనంగా 50,000 మంజూరు చేసే అవకాశం ఉంది. 75 దేశాల నుంచి వచ్చే ఇమిగ్రెంట్ వీసా దరఖాస్తులను ప్రాసెస్ చేయడాన్ని ఈ నెల 21 నుంచి నిలిపేయడమే దీనికి కారణం. ఫ్యామిలీ బేస్డ్ గ్రీన్ కార్డ్ కోటాలు నిరుపయోగంగా మిగిలిపోతే, వాటిని ఎంప్లాయ్‌మెంట్ బేస్డ్ గ్రీన్ కార్డ్ కోటాగా మార్చుతారు.దీనిపై ఇమిగ్రేషన్ నిపుణులు స్పందిస్తూ, కొవిడ్ సమయంలో కూడా ఇలాగే జరిగిందని, ప్రయారిటీ డేట్స్ 4-5 ఏండ్లు ముందుకు జరిగాయని తెలిపారు. ఇమిగ్రేషన్ అటార్నీ ఎమిలీ న్యూమన్ మాట్లాడుతూ, 75 దేశాలపై అమెరికా నిషేధం విధించి ఉండకపోతే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ దేశాలకు దాదాపు 67,000 ఇమిగ్రెంట్ వీసాలను కేటాయించి ఉండేవారని తెలిపారు. ఈ దేశాలపై నిషేధం ఈ ఏడాది సెప్టెంబర్‌తో ముగిసే ఆర్థిక ఏడాది వరకు కొనసాగితే, 50,000 గ్రీన్‌కార్డ్‌లు ఉంటాయన్నారు

# రాజ్యాంగాన్ని కాలరాసిన ఇందిర

మొదటి తరువాయి

రామచందర్ రావు జాతీయ జెండాను ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. చాలా మంది రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలు చేశారని... నెహ్రూ రాజ్యాంగాన్ని పక్కకు పెట్టారని విమర్శించారు. మొదటిసారి రాజ్యాంగాన్ని అవమానించింది నెహ్రూ అని... అంబేద్కర్‌ను అవమానించారని ఆరోపించారు. అంబేద్కర్‌ను ఓడించిన చరిత్ర కాంగ్రెస్‌ది అంటూ విరుచుకుపడ్డారు.సీఐఆర్ పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. గ్రామీణ ఉపాధి పథకంలో కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. పేదలకు మేలు చేయాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమని తెలంగాణ బీజేపీ చీఫ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ 60 ఏళ్లపాటు దేశాన్ని దోచుకుందని.. పేదలకు మేలు చేసే పథకాలను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని రాష్ట్ర బీజేపీ చీఫ్ విమర్శించారు. రేవంత్ రెడ్డిపై క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. అంబేద్కర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం భారతరత్న ఇవ్వలేదని గుర్తుచేశారు. అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని గౌరవించింది మోదీ ప్రభుత్వమని ఆయన వెల్లడించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రైతులకు ఏమీ చేయలేదని, ప్రధాని కిసాన్ యోజన ద్వారా రైతులకు మోదీ మేలు చేస్తున్నారని పేర్కొన్నారు. మజ్లిస్‌తో కలిసి కాంగ్రెస్ పని చేస్తోందని... కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు అవినీతి పార్టీలంటూ వ్యాఖ్యలు చేశారు. రెండు పార్టీలను తరిమికొట్టి బీజేపీని ఆదరించాలని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో ఎంపీ లక్ష్మణ్ సహా పలువురు బీజేపీ నేతలు పాల్గొన్నారు.

## భారత్ నూలుపై సుంకాలు విధించాల్సిందే

మొదటి తరువాయి

దేశీయ మిల్లర్లు హెచ్చరించారు. చాలా ఏళ్లుగా సుంకం లేకుండా భారత్ నుంచి చౌకగా నూలును దిగుమతి చేసుకుంటుండడం వల్ల స్థానిక స్పిన్నింగ్ యూనిట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని వారు లేఖలో పేర్కొన్నారు. దీనివల్ల దేశీయ వస్త్ర పరిశ్రమలో 12వేల కోట్ల కంటే ఎక్కువ విలువైన అమ్ముడుపోని నిల్వలు మిగిలిపోయాయని తెలిపారు. 50కి పైగా వస్త్ర పరిశ్రమలు మూసేయడం వల్ల వేలాదిమంది కార్మికులు నిరుద్యోగులుగా మారారన్నారు. మరోవైపు బంగ్లాదేశ్ వస్త్ర పరిశ్రమ వర్గాల డిమాండ్‌ను అక్కడి వస్త్ర ఎగుమతిదారుల సంఘం వ్యతిరేకిస్తోంది. భారత్ నుంచి దిగుమతి చేసుకున్న నూలుతో పోలిస్తే స్థానికంగా ఉత్పత్తి చేస్తున్న నూలు ఖరీదైనదని ఎగుమతిదారులు పేర్కొన్నారు. అంతర్జాతీయ దుస్తుల బ్రాండ్లు, మెరుగైన నాణ్యత విషయాల్లో ప్రపంచ దేశాలు భారత్‌లో ఉత్పత్తి అయ్యే నూలుకు ప్రాముఖ్యత ఇస్తాయన్నారు. ఇప్పుడు భారత్‌కు ఉన్న డ్యూటీ-ఫ్రీ సదుపాయాన్ని నిలిపివేస్తే అక్కడి నుంచి ఎగుమతులు తగ్గుతాయన్నారు. దీనివల్ల ప్రపంచ దుస్తుల మార్కెట్‌లో పోటీని బంగ్లాదేశ్ ఎదుర్కోలేదన్నారు.

## అమరావతిలో తొలిసారిగా జెండా వందనం

మొదటి తరువాయి

అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ స్వీకరించారు. ఏడాది వేడుకల్లో 22 అలంకృత శకటాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వందేమాతరం, పది సూత్రాల మిషన్, అటవీ శాఖ, ఇరిగేషన్ శాఖ, పాఠశాల విద్య, వ్యవసాయ శాఖ, సీఆర్‌డీఏ తదితర విభాగాల శకటాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలతో రూపొందించిన శకటాలను ప్రదర్శించారు. ఈ వేడుకలకు అమరావతి రైతులు, స్థానికులు, యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా కలెక్టర్లు జాతీయ పతాకాన్ని ఎగురవేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బొందపెట్టాలి

మొదటి తరువాయి

సోమవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో చేవెళ్ల నియోజకవర్గంలోని పలువురు బీజేపీ నేతలు.. బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు కేటీఆర్. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు న్యాయం జరగాలంటే పార్టీ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలన్నారు. రెండోసారి మోసపోతే.. మనం తప్పు చేసిన వాళ్లమవుతామని చెప్పారు. ఈసారి కేసీఆర్ సీఎం అయితే తెలంగాణలో మిగిలిన సమస్యలు పరిష్కారమవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. చేవెళ్లలో కాలె యాదయ్యను తన మనిషి అనుకుని కేసీఆర్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించారని కేటీఆర్ గుర్తు చేశారు. కానీ గెలిపించిన కొన్ని రోజులకే.. ఆయన కాంగ్రెస్ గూటికి వెళ్లాడంటూ మండిపడ్డారు. యాదయ్య పార్టీ మారినట్లు ఆధారాలున్నాయని.. ఆయనపై వేటు వేయాలని స్పీకర్‌ను కోరామన్నారు. కానీ యాదయ్య.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అని స్పీకర్ అంటున్నారని పేర్కొన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, యాదయ్యలు చిన్ననాటి నుంచీ దోస్తులని.. వీరిద్దరూ ఒకే బండిపై తిరిగేవారని కేటీఆర్ చెప్పుకొచ్చారు.చేవెళ్లలో ఐదేళ్ల అబ్బాయిని అడిగినా.. కాలె యాదయ్య పార్టీ మారాడనే చెబుతారన్నారు. కానీ స్పీకర్ మాత్రం ఆయన బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారని చెబుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు.. తాము పార్టీ మారామని చెప్పే దమ్ములేదని కేటీఆర్ అన్నారు.ఎన్నికల ప్రచార సమయంలో చేవెళ్లలో దళితులకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే చాలా హామీలు ఇచ్చారని చెప్పారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్. ప్రతీ దళిత కుటుంబానికి రూ.12 లక్షలు కాదు కదా.. కనీసం 12 పైసలు కూడా ఇవ్వలేదన్నారు. వృద్ధులకు పింఛన్లు పెంచుతామని చెప్పి మోసం చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ అందరినీ కడుపులో పెట్టుకుని చూసేవారని వివరించారు. నాట్లు వేసే సమయంలో టింగ్ టింగ్‌మంటూ రైతుల అకౌంట్‌లలో రైతుబంధు పడేదంటూ ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై నిలదీస్తుంటే.. తమపై కేసులు పెట్టి బూతులు మాట్లాడుతున్నారని విమర్శించారు. బూతులు తమకూ వచ్చన్న ఆయన.. మాట్లాడేందుకు సంస్కారం అడ్డొస్తోందన్నారు. ప్రజల దయతో తామంతా మంత్రులమయ్యామని కేటీఆర్ చెప్పారు.

## భారత్ ఎఫెక్ట్

మొదటి తరువాయి

ఇండియా-యూఏఈ మధ్య కీలక ఒప్పందాలు జరిగాయని రెండు దేశాలు ప్రకటించాయి. ఇదే సమయంలో గతంలో పాకిస్తాన్‌తో యూఏఈ కుదుర్చుకున్న ఎయిర్‌పోర్ట్ డీల్‌ను రద్దు చేసుకుంది. ఇస్లామాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌ను నిర్వహిస్తామని పాకిస్తాన్‌తో యూఏఈ గత ఏడాది ఆగస్టులో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. కానీ, తాజాగా ఈ ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించింది. పాకిస్తాన్.. సరైన నిర్వహణ భాగస్వామిని చూపించకపోవడం వల్లనే ఈ డీల్ రద్దైనట్లు అధికారికంగా వెల్లడించింది. కానీ, దీని వెనుక అంతర్జాతీయ రాజకీయ కారణాలు ఉన్నట్లు స్పష్టమవుతోంది. సౌదీ అరేబియా, యూఏఈ మధ్య ఉన్న వివాదం కూడా మరో కారణంగా చెప్పుకోవచ్చు. పాకిస్తాన్.. సౌదీతోపాటు మరికొన్ని దేశాలను కలుపుకొని ఇస్లామిక్ నాటోను ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తోంది. సౌదీ అరేబియా ఉంది కాబట్టి.. ఇందులో ఆ దేశ ప్రత్యర్థి అయిన యూఏఈ ఉండబోదు. అందుకే దీనికి పోటీగా యూఏఈ.. ఇండియా, ఇజ్రాయెల్‌తో కలిసి కూటమి ఏర్పాటు చేసే ఆలోచనలో ఉంది. తాజాగా ఈ అంశంపై చర్చ జరిగినందునే పాకిస్తాన్‌కు యూఏఈ దూరంగా ఉండాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇండియాకు మరింత దగ్గరయ్యేందుకు యూఏఈ.. పాక్‌తో డీల్ క్యాన్సిల్ చేసుకుంది. మరోవైపు యూఏఈ జైళ్లలో మగ్గుతున్న 900 మంది భారత ఖైదీలను విడుదల చేసేందుకు కూడా యూఏఈ అంగీకారం తెలిపింది.

# అంబరాన్నంటిన గణతంత్ర వేడుకులు

మొదటి తరువాయి

దేశ రాజధాని ఢిల్లీలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో నిర్వహించిన పరేడ్ భారత సైనిక శక్తి పాటవాన్ని సగర్వంగా చాటిచెప్పింది. ఆపరేషన్ సిందూర్‌లో వాడిన పలు ఆయుధ వ్యవస్థలను సైనిక దళాలు కర్తవ్యపథ్ వేదికగా అచ్చెరువొందేలా ప్రదర్శించాయి. ఈ కవాతులో తొలిసారిగా బ్యాటిల్ అరే ఫార్మేషన్‌లో నిర్వహించిన కవాతు మరో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. యుద్ధ క్షేత్రంలో సైన్యాల మోహరింపును పోలినట్టు పరేడ్ నిర్వహించడం అతిథులు ఆశ్చర్యపోయేలా చేసింది. ఈ పరేడ్‌లో త్రివిధ దళాలకు చెందిన 6,050 సైనికులు పాల్గొన్నారు. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్ థీమ్‌తో సాగిన ఆయుధ ప్రదర్శన భారత సైనిక పాటవాన్ని జగద్విదితం చేసింది. ఈ వేడుకల సందర్భంగా నాలుగు ఎమ్ఐ-17 హెలికాప్టర్లు పూల వర్షం కురిపించాయి. ఆపరేషన్ సిందూర్‌కు ప్రతీకగా నిలిచిన ఆకాశ్ ఆయుధ వ్యవస్థ, బ్రహ్మోస్ క్షిపణి ప్రదర్శన, 300 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను సైతం ఛేదించగలిగే సూర్యాస్త్ర రాకెట్ లాంఛర్ అతిథులను ఆకట్టుకున్నాయి. అర్జున్ యుద్ధ ట్యాంకు ప్రదర్శన కూడా ప్రత్యేక అట్రాక్షన్‌గా నిలిచింది. భారత్‌కు అత్యంత కీలకంగా మారిన ఎస్-400 క్షిపణి నిరోధక వ్యవస్థను కూడా ప్రదర్శించారు. అపాచీ, ప్రచండ్ హెలికాప్టర్లు, వివిధ యుద్ధ విమానాల గగనతల విన్యాసాలు మెప్పించాయి. డ్రోన్ ప్రదర్శన కూడా పరేడ్‌లో జనాలను అమితంగా ఆకట్టుకుంది. ఈ కవాతులో కొత్తగా ఏర్పడిన భైరవ్ లైట్ కమాండో



బెటాలియన్ కూడా మరో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. సైనిక కవాతుతో పాటు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల శకటాలు, కళా ప్రదర్శనలు దేశ సాంస్కృతిక వైవిధ్యతను చాటాయి. కేంద్ర ప్రభుత్వ విభాగాలకు చెందిన 30 శకటాలు దేశ ఖ్యాతిని ఇనుమడింపచేశాయి. ఈ వేడుకల్లో దేశం నలుమూలల నుంచి సుమారు 10 వేల మంది అతిథులు పరేడ్‌ను ప్రత్యక్షంగా వీక్షించారు.

### ప్రత్యేక ఆకర్శణగా మోడీ తలపాగా

దేశంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ధరించిన తలపాగా అందరి దృష్టిని ఆకర్షించింది. అలాగే ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లేయెన్ భారతీయత ఉట్టిపడేలా డ్రెస్ ధరించారు. అయితే మరో అరుదైన దృశ్యం ఆవిష్కృతమయ్యింది. ఉర్సులాకు ప్రధాని మోడీ పరేడు వివరాలను ఎప్పటికప్పుడు వివరించారు. మోడీ వివరాలను ఆమె ఆసక్తిగా విన్నారు. ఇకపోతే ప్రధాని మోదీ ప్రకాశవంతమైన ఎరుపు, పసుపు, ఉదా, ఆకుపచ్చ రంగులు కలగలిసిన తలపాగాను ధరించారు. జరీతో నేసిన బంగారు రంగు మోటిఫ్‌లతో అది ఆకర్షణీయంగా కనిపించింది. ఈ రాజస్థానీ సంప్రదాయ తలపాగా.. పండగ వాతావరణాన్ని ప్రతిబింబించింది. అందులోని ఎరుపు.. అభిరుచి, ఉత్సుకత, ధైర్యసాహసాలకు నిదర్శనంగా చెప్తారు. అలాగే ముదురునీలం, తెలుపు రంగుల్లో ఉన్న కుర్తా పైజామా ధరించారు. పైన లేత నీలంలో ఉన్న జాకెట్ వేసుకున్నారు. మరోవైపు ఉర్సులా.. మెరూన్ రంగులో గోల్డ్ డిజైన్ చేసిన డ్రెస్ ధరించారు. ఈ వస్త్రధారణతో ఈ వేడుక కు తగ్గట్టుగా ఆమెలో భారతీయ సంప్రదాయం ఉట్టిపడింది. ఆమె సాధారణంగా ధరించే ప్యాంట్‌సూట్స్‌కు భిన్నంగా ఈ దుస్తులు వేసుకున్నారు. ఐరోపా సమాఖ్యకు ఉర్సులా తొలి మహిళా అధ్యక్షురాలు. 2019లో తొలిసారి బాధ్యతలు చేపట్టిన ఆమె.. 2024లో రెండోసారి ఎన్నికయ్యారు. 2029 వరకు ఆ బాధ్యతల్లో కొనసాగుతారు. అంతకుముందు ఆమె 2005 నుంచి 2019 వరకు జర్మనీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. ఈ పర్యటనలో భాగంగా ఆమె ఇండియా-ఈయూ శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్నారు. మరోవైపు, భారత్-ఐరోపా యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్నాయి. ఈ పర్యటనలో ఆ ఒప్పందం జరిగే అవకాశం ఉంది.

# తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్‌తో పెరిగిన ఇమేజ్

మొదటి తరువాయి

ఈ డాక్యుమెంట్ హైదరాబాద్ ఇమేజ్‌ను మరింత పెంచుతుందని చెప్పారు. రాష్ట్రాన్ని మూడు ఎకనమిక్ జోన్లుగా విభజించి, కీలక రంగాలకు ప్రత్యేకమైన జోన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. మేడారం అభివృద్ధి కోసం రూ.251కోట్లు కేటాయించినట్లు గవర్నర్ వెల్లడించారు. రైతులకు నిరంతరాయంగా ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని, గతేడాది బతుకమ్మ వేడుకలు గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించాయని ఆయన పేర్కొన్నారు. 26 లక్షల మంది రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేసినట్లు, ధాన్యానికి బోనస్‌గా రైతులకు రూ.1,780కోట్లు అందజేశామని గవర్నర్ తెలిపారు. ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉందని గర్వంగా చెప్పారు. భూ వివాదాలను పరిష్కరించేందుకు భూభారతి చట్టం తీసుకొచ్చామని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గ్రూప్-1, 2, 3 ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని, ఇప్పటివరకు 62 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని ఆయన తెలిపారు. ఐటిఐలను అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్లుగా మార్చి, తెలంగాణను గ్లోబల్ స్కిల్ హబ్‌గా



తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించేందుకు ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నామని గవర్నర్ పేర్కొన్నారు. మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని గవర్నర్ తెలిపారు. బ్యాంకుల ద్వారా మహిళలకు రూ.40 వేల కోట్లు సమకూర్చామని, మహిళలను పెట్రోల్ బంక్‌లు, ఆర్టీసీ అ÷-దదె బస్సులకు ఓనర్లుగా చేశామని చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో ఇప్పటికే 200 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణాలు చేశారని వెల్లడించారు. విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇచ్చిన ప్రభుత్వం.. 27 ఎకరాల్లో రూ.2వేల కోట్లతో కొత్త ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం చేపట్టిందని గవర్నర్ తెలిపారు. తెలంగాణలో 1.30 కోట్ల కుటుంబాలకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, రాష్ట్రంలో 3.35 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నామని జిష్ణుదేవ్ వర్మ చెప్పుకొచ్చారు. ప్రతి నియోజకవర్గానికి 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని, చేనేత కార్మికులకు రూ.5లక్షల బీమా పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని, హిల్ట్ పాలసీతో కాలుష్య పరిశ్రమలను సిటీ బయటకు తరలిస్తామని గవర్నర్ వెల్లడించారు. రిపబ్లిక్ డే వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్ బాబు తదితరులు హాజరయ్యారు. అమెరికా పర్యటనలో ఉండటంతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రిపబ్లిక్ డే పరేడ్‌కు హాజరుకాలేదు. సీఎం రేవంత్ రెడ్డి రిపబ్లిక్ డే సందర్భంగా తెలంగాణ ప్రజలకు సోషల్ మీడియా ద్వారా సందేశమిచ్చారు. రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భారత రాజ్యాంగం ఆమోదించబడిన ఈ రోజును భారతదేశ చరిత్రలో ముఖ్యమైన సందర్భంగా సీఎం అభివర్ణించారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం

**బీఆర్ఎస్ మాజీ ఎంపీ సంతోష్‌కు సిట్ నోటీసులు**

**27వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జుబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయంలో స్వయంగా హాజరు కావాలని నోటీసులు**



హైదరాబాద్,

సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో భాగంగా సిట్ అధికారులు తాజాగా బీఆర్ఎస్ మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ రావుకు నోటీసులు జారీ చేశారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా, ఈ వ్యవహారానికి సంబంధించిన కొన్ని కీలక వాస్తవాలు సంతోష్ రావుకు తెలిసి ఉండవచ్చని భావిస్తున్నట్లు పోలీసులు నోటీసులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, విచారణ నిమిత్తం జనవరి 27వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జుబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయంలో స్వయంగా హాజరు కావాలని జుబ్లీహిల్స్ విభాగం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పి. వెంకటగిరి ఆదేశించారు. ఇప్పటికే ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు మాజీ మంత్రులు కేటీఆర్,

హరీష్ రావులను విచారించిన సంగతి తెలిసిందే. ఐటీ చట్టం, ప్రభుత్వ ఆస్తుల నష్టం నిరోధక చట్టం వంటి కఠిన సెక్షన్ల కింద కొనసాగుతున్న ఈ విచారణలో సంతోష్ రావుకు నోటీసులు అందడం రాజకీయ వర్గాల్లో పెను కలకలం రేపుతోంది. రేపు మధ్యాహ్నం జరగబోయే ఈ విచారణలో సిట్ అధికారులు సంతోష్ రావు నుండి ఎటువంటి సమాచారాన్ని రాబడతారనే అంశంపై ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

# స్వాతంత్ర ఉద్యమ చరిత్ర లేని బిజెపి

- ఉపాధిలో గాంధీ పేరును తొలగించారు
- ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కిన ఘనత బీజేపీది
- గాంధీభవన్‌లో జెండా ఆవిష్కరణలో పీసీసీ చీఫ్



హైదరాబాద్,

స్వాతంత్య ఉద్యమంలో పాల్గొనని పెద్దలు 2014 నుంచి అధికారంలోకి వచ్చారని, వారు రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మర్శించారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. టీపీసీసీ అధ్యక్షుడు జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ పేరును తొలగించాలని మన్రేగా పథకాన్ని రద్దు చేస్తున్నారని.. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ చిత్రాలు కనిపిస్తాయని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. 2014 వరకు యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన సంక్షేమ పథకాలను తొలగిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతున్నారని, లౌకికవాదానికి తూట్లు పొడుస్తున్నారని, కులాలు- మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని మహేష్ గౌడ్ ఆరోపణలు గుప్పించారు. కేసీఆర్ హయాంలో తెలంగాణలో ఆర్థిక విధ్వంసం జరిగిందని... సీఎం రేవంత్ రెడ్డి ఆర్థిక విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సూచనలతో తెలంగాణను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. కుల సర్వేతో యావత్ రాష్ట్రాలు తెలంగాణ వైపు చూస్తున్నాయని తెలిపారు. బీసీలకు 40 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. కులగణన బిల్లులను బీజేపీ అడ్డుకుంటోందని, బీజేపీ కుట్రలను ప్రజలు అర్థం చేసుకోవాలని టీపీసీసీ చీఫ్ కోరారు. మహాత్ముడి ఆధ్వర్యంలో స్వాతంత్య్ర పోరాటం విజయవంతమైందని, ప్రపంచం గర్వించదగ్గ రాజ్యాంగాన్ని అంబేద్కర్ రాశారన్నారు. మహాత్మా గాంధీ కలలు నెరవేర్చే దూరదృష్టి ఉన్న వ్యక్తి నెహ్రూ అని ప్రశంసించారు. ఐరన్ లేడీ ఇందిరా గాంధీ, పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ దేశానికి గట్టి పునాదులు వేశారని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంత్రులు డాక్టర్ అజారుద్దీన్, షబ్బీర్ అలీ సహా వీహెచ్, దానం నాగేందర్, సంపత్, కోదండరాం, బెల్లయ్య నాయక్, చిన్నారెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# సమర నినాదం



మతతత్వంపై మహిళల అణచివేతలపై మరింత చేతనమై యుద్ధం చేస్తామని, సమానత్వం కోసం, హక్కుల కోసం సమరం కొనసాగిస్తామని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) గొంతెత్తి నినదించింది. సమాజంలో, కుటుంబంలో, ఆర్థిక వ్యవస్థలో మహిళలు ముఖ్యపాత్ర పోషిస్తున్నప్పటికీడశ్రమకు తగ్గ గుర్తింపు, హక్కులు వారికింకా దూరంగానే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. పోరాటం చేయడం ద్వారానే సమానత్వం సాధించగలమని బలంగా నమ్మిన 'ఐద్వా' జాతీయ మహాసభలు హైదరాబాద్ నగరంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. సామ్రాజ్యవాదంపై, మనువాదంపై పోరాడుతూ స్త్రీ సమానత్వం సాధించడమే తమ లక్ష్యంగా ప్రకటించిన 'ఐద్వా' మహాసభలలో దానికి అనుగుణంగా తీర్మానాలు చేసి భవిష్యత్తు ప్రణాళికను ప్రకటించనున్నారు. మనదేశంలో అప్రకటిత రాజ్యాంగంగా చెలామణి అవుతున్న మనుస్మృతి బోధించిన పురుషాధిక్య భావజాలం, స్త్రీని బానిసగా చూసే మనస్తత్వం మహిళను ఇలాగే ఉండాలంటుంది. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ రంగాల్లో స్త్రీలను ఆంక్షలకు, లింగ వివక్షతకు గురిచేస్తోంది.

అందుకే దేశంలో స్త్రీల ఆశలకు, ఆకాంక్షలకు, వారి హక్కుల సాధనకు ఐద్వా ఒక వేదికయింది. స్త్రీల సమస్యలను ఒక రాజకీయ ఎజెండాలోకి తీసుకువచ్చేందుకు, అన్ని సంఘాలను ఐక్యం చేసి ఉద్యమించడానికి చాలా గట్టి ప్రయత్నం చేసిందిడచేస్తోంది. సంస్కృతి పేరుతోనే కాదుడ కులం-మతం పేరిట దాడులు, లైంగిక హింస పెరుగుతున్న వేళ, మహిళలను కాపాడాల్సిన పోలీసు వ్యవస్థ, చట్టాలు నేరస్తులకు కొమ్ముకాయడం, మహిళల ఉపాధికి గండికొట్టడం వంటి వాటిపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. స్త్రీని లైంగికవస్తువుగా, ద్వితియశ్రేణి పౌరులుగా చూసినంత కాలం ఈ హింస తగ్గదు. మహిళలలో భక్తి, ఆచారాల పేరుతో అంధవిశ్వాసాలను ప్రచారం చేస్తూ పాలకులు వాళ్లను పావులుగా వాడుకుంటున్నారని దీన్ని తిప్పి కొట్టాల్సిన అవసరాన్ని 'ఐద్వా' నొక్కిచెప్పింది. మహిళాభివృద్ధి, సమానత్వం, సాధికారత అని పాలకులు చెబుతున్న మాటల్లోని డొల్లతనాన్ని ఖుల్లం ఖుల్లా ఎండగట్టింది. ఈ నేపథ్యంలో 'ఐద్వా' మతతత్వానికి వ్యతరేకంగా తీర్మానం చేసింది. 'దేశంలో మహిళల అభివృద్ధి, సాధికారతకు తమ ప్రభుత్వం పదకొండేండ్లుగా అవిశ్రాంతంగా కృషి చేస్తోంది" అని ప్రధానమంత్రి మోడీ మాటలంతా జుమ్లానే అని ఐద్వా మహసభలలో పాల్గొన్న నలుగురు వీరవనితలు కుండబద్దలు కొట్టి మరి చెప్పారు. స్వచ్ఛ భారత్, జన్ ధన్ యోజన, నారీ శక్తి, బేటీ బచావో బేటీ పఢావోడలాంటి నినాదాలు మన ఆడపడుచుల గౌరవం పెంచాయంటూడ తనకు తానే జబ్బలు చరుచుకొని తెగ పొంగిపోతున్న ప్రధాని గుండెలదిరెలా 'బీజేపీకో భగావో..దేశ్‌కో బచావో' అంటూ మహిళలు సింహనాదం చేశారు. 'నిత్యం లైంగిక దాడులతో చిల్లులు పడిన దేహంతో 'భారతమ్మ' చేస్తున్న హాహాకారాలు కూడా వారి కండ్లకు కేరింతలుగానే కనబడుతున్నాయంటూ పాలకుల కుటిలత్వాన్ని ఎండగట్టారు. చదువుకునే ఆడపిల్లలను హింసించడం, దేశ కీర్తి ప్రతిష్టలను ప్రపంచానికి చాటిన క్రీడాకారులపై లైంగికదాడులకు పాల్పడిన ఉదాహరణలు కోకొల్లలు. వారందరికి ఐద్వా అండగా నిలబడింది. వారి తరపున పోరాటాలను నడిపింది..నడిపిస్తోంది. ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా, విధ్వంసం జరిగినా తొలుత నష్టపోయేది మహిళలు, పిల్లలే. సామ్రాజ్యవాద ఆసరాతో ఇజ్రాయిల్ గాజాపై చేస్తున్న దాడి ప్రాణాలు కోల్పోయినవారిలో మహిళలు, పిల్లలే అత్యధికులు. అందుకే పాలస్తీనాకు అండగా 'ఐద్వా' తీర్మానం చేసింది. వెనిజులాలో సామ్రాజ్యవాదం దిగంబరంగా చమురుపై అధిపత్యాన్ని పొందడానికి ప్రజాస్వామ్యాన్ని నిలువునా ఖూనీచేసింది. ప్రజలెన్నుకున్న అధ్యక్షుడు మదురోను, అతని భార్యను అమెరికా నిర్బంధించడాన్ని ఐద్వా తీవ్రంగా ఖండించింది. దేశంలో 'సర్' పేర ఓటర్ల లిస్టు నుంచి తొలగించబడుతున్న వారిలో దళిత, ఆదివాసి, మైనార్టీ మహిళలే అధికంగా ఉన్నారంటూ ఐద్వా మహాసభ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తున్న 'సర్'పై ఐద్వా సమరం ప్రకటించింది. మరల దేశంలో మధ్యయుగ భూస్వామ్య, ప్రగతి నిరోధక భావజాలం పెచ్చుమీరుతున్న వేళ ఈ మహాసభలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. దేశంలో కోటి ఇరవై లక్షలకు పైగా సభ్యత్వం కల్గిన అతిపెద్ద మహిళా సంఘంగా ఐద్వా ఉంది. వారందరికి ప్రాతినిథ్యం వహిస్తూ దేశవ్యాప్తంగా 850 మంది ప్రతినిధులు ఈ మహాసభలలో పాల్గొంటున్నారు. బాల్యవివాహాలు, మూఢనమ్మకాలు, వరకట్నాలు వంటి సామాజిక రుగ్మతలపై 'ఐద్వా' నిరంతరం పోరాడుతూనే ఉంటుంది. "ఆధునిక స్త్రీ చరిత్రను తిరగరాస్తుంది" అని గురజాడ అన్న మాటలను నిజం చేయడానికి 'ఐద్వా' కృషి చేస్తోంది. అందుకు ఆదివారం హైదరాబాద్ మహానగరంలో దిక్కులు పిక్కటిల్లేలా మారుమోగిన నినాదాలే నిదర్శనం.

# శుభాంశు శుక్లాకు అశోకచక్ర ప్రదానం

**న్యూఢిల్లీ - జనవరి 26 (మహాప్రభ )**
అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోని అడుగుపెట్టిన తొలి భారతీయుడు గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ అత్యున్నత శౌర్య పురస్కారం అశోక చక్రతో గౌరవించారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవంలో కెప్టెన్ శుభాన్షు శుక్లాకు ఆమె ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లేందుకు యాక్సియమ్-4 మిషన్ చేపట్టిన సమయంలో గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా అసాధారణ ధైర్యంతో పాటు ఆయన సంకల్పానికి గౌరవంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సత్కరించారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ ఎక్స్ వేదికగా వెల్లడించింది. 2025 జూన్‌లో 'యాక్సియమ్-4' మిషన్ ద్వారా అంతర్జాతీయ




అంతరిక్ష కేంద్రంలోకి శుభాన్షు శుక్లా అడుగుపెట్టారు. దాదాపు 18 రోజుల పాటు ఆయన అక్కడే ఉండి అంతరిక్ష పరిశోధనలకు అవసరమైన కీలక ప్రయోగాలు చేశారు. ఖగోళంలో జీరో గ్రావిటీ పరిస్థితుల్లో మానవ కండరాలకు కలిగే నష్టం, మానవ జీర్ణ వ్యవస్థ ఎలా పని చేస్తుందనే అంశాలపై ఆయన వీడియో చిత్రీకరించారు. అలాగే అంతరిక్షంలో మానవ వ్యోమగాముల పరిస్థితిపై సైతం ఆయన అధ్యయనం చేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)ను సందర్శించిన తొలి భారతీయుడిగావ్యోమగామి గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా రికార్డుకెక్కారు. భారత్ సొంతంగా చేపట్టబోయే మానవసహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్‌కు ఎంపికైన మరో వ్యోమగామి గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్ రెండో అత్యున్నత శౌర్య పురస్కారం 'కీర్తి చక్ర'ను అందజేశారు.

# గిగ్‌వర్కర్ల ఆన్‌లైన్ సమ్మె.. మొబైల్ యాప్‌ల డీయాక్టివేషన్

**వినియోగదారులకు ఇబ్బందులు**
**ఫిబ్రవరి 3న భౌతికంగా నిరసన**




**న్యూఢిల్లీ, - జనవరి 26 (మహాప్రభ )**
దేశవ్యాప్తంగా గిగ్, ప్లాట్‌ఫామ్ సర్వీస్ వర్కర్లు సోమవారం ఆన్‌లైన్ నిరసన ప్రారంభించారు. ఫిబ్రవరి 3 నుంచి భౌతికంగా సమ్మెలోకి దిగడానికి ముందు ఆన్‌లైన్ నిరసనను ప్రారంభించిన గిగ్, ప్లాట్‌ఫామ్ సర్వీసు వర్కర్లు తమ మొబైల్ యాప్‌ల డీయాక్టివేషన్ చేపట్టారు. గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ సర్వీసు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిరసన కేవలం డెలివరీ గడువు గురించి మాత్రమే కాక తమను కార్మికులుగా గుర్తించాలని, జీవనభద్రత కల్పించాలని, తమ పట్ల గౌరవంగా వ్యవహరించాలని, మహిళా వర్కర్లకు భద్రత కల్పించాలని వారు డిమాండు చేస్తున్నారు.భారత్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న సమయంలో గిగ్, ప్లాట్‌ఫామ్ సర్వీసు వర్కర్ల సమ్మె తీవ్ర ప్రభావం చూపింది. సమ్మెతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


# ఏఐపై అతి పెద్ద తప్పు అదే..

**- దానితో కలిసి ఎలా మనుగడ సాగించాలో పరిశోధించడం లేదు**
**-ఏఐ గాడ్‌ఫాదర్ జెఫ్రీ హింటన్**



**వాషింగ్టన్ : - జనవరి 26 (మహాప్రభ )**
అతి త్వరలో మానవుల కన్నా తెలివైన వాటిని అభివృద్ధి చేసే కీలక దశలో మనం ఉన్నామని కృత్రిమ మేధ (ఏఐ) పితామహుడు జెఫ్రీ హింటన్ చెప్పారు. వాటితో మనం ప్రశాంతంగా సహజీవనం చేయగలమా? అనే అంశంపై పరిశోధన చేయడం లేదన్నారు. ఆ పరిశోధన చేయవలసిన అవసరం చాలా ఉందని స్పష్టం చేశారు. ఈ దశలో మానవుడు చేసే అతి పెద్ద తప్పు ఈ పరిశోధన చేయడంలో విఫలమవడమేనని తెలిపారు. మనల్ని పట్టించుకోని విధంగా వాటిని మనం సృష్టిస్తే, అవి బహుశా మనల్ని తుడిచిపెట్టేయవచ్చునని చెప్పారు. బీబీసీ న్యూస్‌నైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో హింటన్ మాట్లాడుతూ, ఏఐని అభివృద్ధి చేయడం కోసం తాను తన జీవితాన్ని అంకితం చేశానని తెలిపారు.అది ఇప్పుడు అత్యంత ప్రమాదకరంగా మారడం తనకు చాలా విచారకరమని చెప్పారు. కానీ జనం ఆ ప్రమాదాలను తగినంత శ్రద్ధ, తీవ్రతలతో పట్టించుకోవడం లేదన్నారు. మానవుల కన్నా తెలివైన యంత్రాలను తయారు చేయడానికి పరిశోధకులు అత్యంత సమీపంలో ఉన్నారని పేర్కొన్నారు. ఏఐ రానున్న 20 ఏండ్లలో మానవ మేధాశక్తిని అధిగమిస్తుందని, చాలా రంగాల్లో అది ఇప్పటికే ఆ స్థితికి చేరిందని పరిశోధకులు చెప్తున్నారన్నారు. అదే జరిగితే, అలాంటి సిస్టమ్స్‌ను నియంత్రించడం ఊహించినదాని కన్నా చాలా కష్టమన్నారు.

# మందుపాతర పేలి 11 మంది జవాన్లకు గాయాలు



**కొత్తగూడెం - జనవరి 26 (మహాప్రభ )**
: భద్రతా బలగాలే లక్ష్యంగా మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి 11 మంది జవాన్లకు గాయాలయ్యాయి. ఈ ఘటన తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రా ల సరిహద్దు బీజాపూర్ జిల్లాలో సోమవారం చోటు చేసుకుంది. బీజాపూర్ జిల్లా ఉసూర్ పోలీస్‌స్టేషన్ పరిధి కర్రెగుట్ట అడవుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారం మేరకు డీఆర్‌జీ, కోబ్రా భద్రతా దళాలు సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో అదే ప్రాంతంలో భద్ర తా బలగాలే లక్ష్యంగా మావోయిస్టులు ఆరుచోట్ల అమర్చిన మందుపాతరలు పేలా యి. దీంతో పది మంది డీఆర్‌జీ బలగాలతోపాటు ఓ కోబ్రా జవాన్ తీవ్ర గాయాల పాలయ్యాడు. దీనిని గమనించిన తోటి జవాన్లు క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించి హుటాహుటిన మెరుగైన వైద్యం కోసం రాయ్‌పూర్ దవాఖానకి తరలించారు.

# భారత్‌తో వాణిజ్య చర్చలను అడ్డుకున్నది వాన్స్, ట్రంపే

**అమెరికన్ సెనేటర్ టెడ్ క్రుజ్**

**వాషింగ్టన్ - జనవరి 26 (మహాప్రభ )**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలో అంతర్గత భేదాభిప్రాయాలు బయటపడుతున్నాయి. యూఎస్ సెనేటర్, టెక్సాస్ రిపబ్లికన్ టెడ్ క్రుజ్ మాట్లాడిన ఓ ఆడియో సంచలనం సృష్టిస్తున్నది. వాణిజ్య విధానాలు, భారత్-అమెరికా మధ్య టారిఫ్ అగ్రిమెంట్ ప్రతిష్టంభనకు కారకులు



అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, వైట్ హౌస్ సలహాదారు పీటర్ నవారో, కొన్ని సందర్భాల్లో స్వయంగా ట్రంప్ అని టెడ్ క్రుజ్ ఈ ఆడియోలో చెప్పారు.దాదాపు 10 నిమిషాల నిడివి గల ఈ ఆడియోను రిపబ్లికన్ వర్గాలు బయటపెట్టాయి. ఇది 2025 తొలి అర్ధ సంవత్సరంలో మాట్లాడిన ఆడియో. టెడ్ ప్రైవేట్ డోనర్స్‌తో మాట్లాడుతుండగా ఈ ఆడియోను క్యాప్చర్ చేశారు.

# 10 వేల కిలోల పేలుడు పదార్థాలు పట్టివేత

**హైదరాబాద్- జనవరి 26 (మహాప్రభ )**
రిపబ్లిక్ డే సందర్భంగా దేశంలో కలకలం రేగింది. రాజస్థాన్ ఏటీఎస్, స్థానిక పోలీసులు సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో జైపూర్ సమీపంలోని అంబాబరి ప్రాంతంలో



దాచిన సుమారు 10 వేల కిలోల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఒక గోదాం, మరో ఇంటి ఆవరణలో వీటిని నిల్వ చేసినట్లు గుర్తించారు. గణతంత్ర వేడుకలను లక్ష్యంగా చేసుకుని దాడులకు కుట్ర పన్నినట్టు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో నలుగురిని అరెస్టు చేయగా.. వారిలో ఒకరికి ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నట్లు తేలింది.

# ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యాలు.







**- పాఠశాల డైరెక్టర్..... సత్తు మహిపాల్ రెడ్డి**
**-పాఠశాల అభివృద్ధికి విరాళం ప్రకటించిన....**
**-పాఠశాల పూర్వ విద్యార్థి దుబ్బ రాజోళ్ళ " సంపత్**
**- 37 సంవత్సరాల నుండి అత్యుత్తమ ఫలితాలతో విద్యారంగంలో రానిస్తున్న ఏకైక విద్యాసంస్థ విజ్ఞాన భారతి,**

**దుబ్బాక – జనవరి 26 (మహాప్రభ)**
వెల్లివెత్తిన ప్రశంసల జల్లు మన త్రివర్ణ పథకం మన దేశ గౌరవం దేశానికి కృషి చేయాలి దేశ ప్రగతికి పునాదులై రాజ్యాంగాన్ని గౌరవించాలి భిన్నత్వంలో ఏకత్వం భారతదేశానికి అందించిన వరం కర్తవ్యాలను గుర్తిస్తూ నిస్వార్థంగా సేవ చేయాలి... రాజ్యాంగ అందించిన మౌలిక హక్కులను కాపాడుకోవాలి ప్రాథమిక విధులను నిర్వర్తిస్తూ దేశ అభివృద్ధికి కృషి చేయాలి, సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రంలోని 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను సోమవారం రోజున మండల కేంద్రంలోని శ్రీ సీతారాముల కల్యాణ మండపంలో విజ్ఞాన భారతి ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు నిర్వహించిన సంస్కృత కార్యక్రమాలలో విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సత్తు మహిపాల్ రెడ్డి, మాట్లాడుతూ రాజ్యాంగ శిల్పి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కలలుగన్న సమానత్వం సమాజ నిర్మాణానికి అందరం కట్టుబడి ఉండాలని కోరారు. జాతి పునాదులైన సమానత్వం స్వేచ్ఛ న్యాయం సోదర భావం అనే నాలుగు స్తంభాలు దేశ భవిష్యత్తును మరింత ఉజ్వలంగా నిర్మించాలని ఆకాంక్షించారు. ఎందరో మహానుభావుల త్యాగ ఫలితమే స్వేచ్ఛ వాయు అని అన్నారు. రాజ్యాంగ అందించిన మౌలిక హక్కులను కాపాడుకోవాలని పేర్కొన్నారు. ప్రాథమిక విధులను నిర్వర్తిస్తూ దేశాభివృద్ధికి కృషి చేసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కర్తవ్యాలను గుర్తిస్తూ నిస్వార్థంగా సేవ చేయాలని అన్నారు. భిన్నత్వంలో ఏకత్వం అనేది భారతదేశానికి అందించిన వరం అని చెప్పారు. దేశ ప్రగతికి పునాదులైన రాజ్యాంగాన్ని గౌరవించాలన్నారు. మన త్రివర్ణ పథకం మన దేశ గౌరవం అంటూ దేశాభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. 37 సంవత్సరాల నుండి ఏకైక యాజమాన్య సారధ్యంలో గ్రామీణ విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తూ సేవలను గుర్తించిన పూర్వ విద్యార్థి దుబ్బ రాజోళ్ళ, సంపత్ పాఠశాల అభివృద్ధికి గాను తన వంతుగా 20వేల రూపాయల విరాళం ప్రకటించినట్లు తెలిపారు. విరాళం ప్రకటించిన సంపత్ కు యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలను డైరెక్టర్ తిలకించి వారి కల నైపుణ్యాలను అభినందించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ సత్తు సుజాత విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ క్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఆంజనేయులు, ఇన్చార్జి ప్రిన్సిపల్ సంపత్ ఉపాధ్యాయులు తిరుమల రాణి, మంగ స్వప్న, జ్యోతస్న, వాణి తో పాటు అధికారులు అనధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్.

**- ముఖ్య అతిథిగా మాజీ చైర్మన్ చంద్రపాల్..**



**మెదక్ జిల్లా –26జనవరి (మహాప్రభ).**
మెదక్ జిల్లా ఫోటో మరియు వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం జిల్లా క్రికెట్ పోటీలు సి యస్ ఐ గ్రౌండ్ లో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీలో ఏ. గ్రూప్ లో మెదక్ బి,తూప్రాన్,కెమెరా వారియర్స్,శంకరం పేట్ (ఆర్ )రామాయం పేట్, గ్రూప్ (బి )వెల్దుర్తి, డాకూరే వారియర్స్,మెదక్ (బి )చేగుంట,అల్లాదుర్గ్ 10జట్లు పాల్గొన్నాయి. టోర్నమెంట్ రెండు రోజులు చేపట్టారు. ఈ పోటీలను మున్సిపల్ చంద్రపాల్ ప్రారంభించారు. సెమీ ఫైనల్స్ కు మెదక్, శంకరం పేట్ (ఆర్ )పోటీ పడగా శంకరం పేట్, (ఆర్ ) ఫైనల్స్ కు చేరుకుంది. డాకురే వారియర్స్, అల్లా దుర్గ్ సెమీ ఫైన్సల్స్ పాల్గొనగా అల్లా దుర్గ్ ఫైనల్ లో చేరకుంది. ఫైనల్ లో శంకరం పేట్ –అల్లదుర్గ్ పోటీ పడి అల్లా దుర్గ్ విజయం సాధించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా తాజా మాజీ మెదక్ మున్సిపాల్ ఛైర్మెన్ తోడుపునూరి చంద్రపాల్ పాల్గొని గెలుపొందిన జట్టు అల్లదుర్గ్ కు, రన్నరప్ శంకరం పేట్ (ఆర్ ) జట్లకు కప్ లను అందజేశారు. గెలుపొందిన జట్టు కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఫోటో గ్రఫీ రంగం ఫోటో లు తీయడమే కాకుండా క్రీకేట్ రంగంలో కూడా రావడం చాలా మంచిదన్నారు. జీవితంలో టాబ్లెట్ లేకుండా బ్రతకాలంటే ఆరోగ్యం ముఖ్యమన్నారు. ప్రతి రోజు మనం 10 నిమిషాల నడుక, 10 నిమిశాల ధ్యానం అవసరం. అని ఆన్నారు. ఈ క్రీడా పోటీలు రాష్ట్ర స్థాయి లో పెట్టాలన్నారు. ఈ క్రాయక్రమం లో రాష్ట్ర ఫోటోగ్రాఫర్ వీడియో గ్రాఫర్ సంక్షేమ సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు వెంకటరెడ్డి, రాష్ట్ర కోశాధికారి మాధవరెడ్డి, ప్రధాన సలహాదారులు శ్రీధర్ బాబు, జాయింట్ సెక్రెటరీ జంగారెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి దాసరి శ్రీధర్, జి ఆర్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షులు నరేష్ బాబు,మాజీ కౌన్సిలర్ గోదల సాయి, సి యస్ ఐ ట్రెజరర్ సంపత్, మెదక్ జిల్లా అధ్యక్షులు కంచి ఆనంద్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి శ్రీధర్,జిల్లా సలహా దారుడు బస్వారాజ్,మండల అధ్యక్షులు సురేందర్,ప్రధాన కార్యదర్శి హరీష్,కోశాధికారి ఈగ శ్రీకాంత్ ,స్పోర్ట్స్ కమిటి

# కాంగ్రెస్ సర్కార్ అంటేనే పేదల ప్రభుత్వం

**-ప్రభుత్వ సంక్షేమ పథకాలే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తాయి**
**-కాంగ్రెస్ పార్టీకి ఓటేసి అభివృద్ధి లో భాగస్వాములు కండి**
**-మాజీ ఎమ్మెల్యే మైనం పల్లి హన్మంతరావ్**



**మెదక్ జిల్లా–27జనవరి (మహాప్రభ)**
కాంగ్రెస్ సర్కార్ అంటేనే పేదల ప్రభుత్వమని, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలే కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీ తో గెలిపిస్తాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు,మాజీ ఎమ్మెల్యే మైనం పల్లి హన్మంతరావ్ తెలిపారు. సోమవారం మెదక్ పట్టణం అవుసులపల్లి లోనీ ముత్యాలమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పల్లు వార్డులలో మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్బంగా మైనంపల్లి హనుమంతరావు, డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ లు మాట్లాడుతూ
కాంగ్రెస్ పార్టీకి ఓటేసి అభివృద్ధి లో భాగస్వాములు కావాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన రెండు సంవత్సరాల కాలంలోనే ప్రజల ఆశయాలకు అనుగుణంగా ఒక్కొక్క హామీని అమలుపరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకు వెళుతున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టణంలో కోట్లది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేస్తున్నామని గుర్తు చేశారు. గత పాలకులు పట్టణాన్ని దోచుకున్నారని అభివృద్ధిని గత పాలకులు మర్చిపోయారని విమర్శించారు. పట్టణంలో ఇళు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి వారిని సొంతింటి వారిని చేయడం జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వం అని నిరుపేదలకు కాంగ్రెస్ సర్కార్ అండగా ఉంటుందని తెలిపారు. ప్రతి వార్డులో పార్టీ క్యాడర్ సమన్వయంతో పనిచేయాలని కోరారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపాలిటీ చైర్మెన్ తోడుపునూరి చంద్రపాల్ మాజీ కౌన్సిలర్స్, సీనియర్ నాయకులు, బ్లాక్, మండల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొనారు.

## తిమ్మాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జెండా ఆవిష్కరణ చేసిన మెడికల్ ఆఫీసర్ దివ్యశ్రీ



**దుబ్బాక – జనవరి 26 (మహాప్రభ )**
సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ దివ్యశ్రీ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ దివ్యశ్రీ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికి హక్కులను అవగాహనను అంబేద్కర్ రచించి అమల్లోకి తెచ్చిండని రాజ్యాంగం ప్రతి ఒక్క హక్కు అని మెడికల్ ఆఫీసర్ దివ్యశ్రీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అల్కానంద సిహెచ్ ఓఎల్ టీ రగుత్తంరెడ్డి ఫార్మసిస్ట్ నవీన్ ఆయుష్, శేఖర్ యాదగిరి హెల్త్ సూపర్వైజర్ శోభారాణి, శ్యామల, ఏఎన్ఎంలు రమాదేవి, పుష్పలత, భారతమ్మ, రాజ్యలక్ష్మి, రేణుక, సౌందర్య, వాచ్మెన్లు,కిష్టయ్య, నరసవ్వ, యశోద, తదితరులు పాల్గొన్నారు.

## టెక్మాల్ విద్యుత్ కార్యాలయంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



**మెదక్ జిల్లా –26జనవరి (మహాప్రభ):.**
మెదక్ జిల్లా టెక్మాల్ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయంలో సోమవారం రోజు 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏఈ ఉదయ్ భాస్కర్ జాతీయ జెండాకు కొబ్బరికాయ కొట్టి ఎగురవేశారు. అనంతరం విద్యుత్ సిబ్బంది మిఠాయిలు పంచుకుని వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ లైన్ ఇన్స్పెక్టర్ లు దుర్గాప్రసాద్,ఏలూరు సూర్యనారాయణ,లైన్మెన్లు ఎండీ. షాదుల, దుర్గయ్య,పాండ్య,జూనియర్ లైన్మెన్లు పండిత్ నాయక్,పడమటి రవి, ఆర్టిజన్లు పోల శ్రీనివాస్, మోహన్,సుధాకర్, నర్సింలు,సాయి,రవి, తదితరులు పాల్గొన్నారు.

# దుబ్బాకలో జాతీయ జెండాకు అవమానం

**- తలకిందులుగా జాతీయ జెండా ఆవిష్కరణ**
**-దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి**





**దుబ్బాక – జనవరి 26 (మహాప్రభ )**
జాతీయ జెండాకు అవమానం జరిగింది. సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద రిపబ్లిక్ డే వేడుకల్లో భాగంగా స్థానిక దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. జాతీయ జెండాను ఆవిష్కరించే ఆ సమయంలో అజాగ్రత్త వల్ల జెండా తలకిందులుగా ఎగిరింది. జెండా తలకిందులుగా ఉండటాన్ని గమనించిన స్థానికులు, కాంగ్రెస్ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. జాతీయ జెండా గౌరవానికి భంగం కలిగించే విధంగా ఎమ్మెల్యే వ్యవహరించాలని వారు మండిపడ్డారు. జెండా ఆవిష్కరణ అనంతరం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు చేయడం మొదలుపెట్టారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఆయన చేసిన వాక్యాలు అక్కడ ఉన్న కాంగ్రెస్ శ్రేణులకు ఆగ్రహం తెప్పించాయి. దీంతో కాంగ్రెస్ నాయకులు, జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేయగా, దానికి ప్రతిగా బి ఆర్ ఎస్ కార్యకర్తలు జై బి ఆర్ ఎస్ అంటూ, పోటీ నినాదాలకు దిగారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య మాట పెరిగి, పరస్పరం నెట్టుకుంటూ బాహాభహిక దిగారు, పరిస్థితి అదుపు తప్పుతుండటంతో అక్కడే ఉన్న పోలీసులు తక్షణమే స్పందించారు. ఇరు పార్టీల నాయకులను, కార్యకర్తలను విడదీసి శాంతింపజేసే ప్రయత్నం చేశారు. జాతీయ పండగ రోజైన గణతంత్ర దినోత్సవం నాడు రాజకీయ విమర్శలు, తోపులాటలు జరగడం పట్ల స్థానిక ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

# రామాయంపేటలో కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్

- బిఆర్ఎస్ పార్టీలో చేరిన సీనియర్ నాయకులు
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ మంత్రి హరీష్.
- పార్టీ నాయకత్వం కృషి చేయాలని పిలుపునిచ్చిన మాజీ మంత్రి హరీష్ రావు.



**రామాయంపేట-జనవరి 26 ( మహాప్రభ )**
మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు సమక్షంలో మెదక్ బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు యం. పద్మ దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రామాయంపేట మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు జొన్నల బాలు గత కొంత కాలంగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు.రామాయంపేట అభివృద్ధి కోసం జొన్నల బాలు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి సిద్దిపేటలోని క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు సమక్షంలో పార్టీలో చేరారు..ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ...రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగర వేస్తుంది అని ధీమా వ్యక్తం చేశారు.. పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కంఠరెడ్డి.తిరుపతిరెడ్డి,మాజీ మున్సిపల్ పల్లె జితేందర్ గౌడ్,మాజీ పిఎసిఎస్ చైర్మన్ బాదే.చంద్రం, నాయకులు పుట్టి.యాదగిరి, కన్నాపురం.కృష్ణ గౌడ్,ఉమా మహేశ్వర్,అస్మద్దీన్,బాసం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## AITUC యూనియన్ కార్యాలయంలో జాతీయ జండా ఆవిష్కరణ



**హైదరాబాద్ - జనవరి 26 ( మహాప్రభ )**
77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా GHMC ప్రధాన కార్యాలయంలో AITUC యూనియన్ కార్యాలయంలో అధ్యక్షులు కె. రవి కిషోర్ మరియు కార్మికులు జాతీయ జెండాను ఎగరవేశారు.ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ బాలకృష్ణ (సైబరాబాద్ డివిజన్) వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి (హైదరాబాద్)అదనపు అధ్యక్షుడు జయకిషోర్ (సైబరాబాద్ డివిజన్) వైస్ ప్రెసిడెంట్ బి. శ్రీకాంత్ తిరుపతయ్య, జోనల్ ప్రెసిడెంట్ (సెరిలింగంపల్లి) శైలజ మరియు విజయ నిర్మల (మహిళా కమిటీ సభ్యులు)లి, మరియు AITUC (GHMC) సలహాదారుడు ఎం.డి. ఖలీద్‌లి వంటి యూనియన్ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా, అధ్యక్షులు కె.రవి కిషోర్ ఈ వేడుకను విజయవంతంగా నిర్వహించడంలో అంకితభావం, సహకారం మరియు నిబద్ధతకు యూనియన్ సభ్యులు మరియు కార్మికులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## బోడుప్పల్ రాజీవ్‌నగర్‌లో గణతంత్ర వేడుకలు

**బోడుప్పల్, - జనవరి 26 ( మహాప్రభ )**




బోడుప్పల్ రాజీవ్‌నగర్ కాలనీ డబుల్ బెడ్‌రూమ్ కమ్యూనిటీ హాల్‌లో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దానగల్లా యాదగిరి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, మున్సిపల్ సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజే గణతంత్ర దినోత్సవం. ప్రజలు కలసి మెలసి ఉండాలి. రాజీవ్‌నగర్ కాలనీ ఏర్పాటుకు చేసిన పోరాటం ఫలితమే నేటి అభివృద్ధి" అని పేర్కొన్నారు.కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు గోపు రాములు, కాలనీ ఉపాధ్యక్షుడు నానాజీ, కమ్యూనిటీ హాల్ అధ్యక్షుడు చిప్పల శ్రీధర్, గౌరవ అధ్యక్షుడు అన్నందాసు బిక్షపతి, ప్రధాన కార్యదర్శి తుక్కోజీ అమరేందర్, కోశాధికారి కిలారి అశోక్, సలహాదారులు రాజగోపాల్, సతీష్ కుమార్, బ్లాక్ ఇంచార్జ్‌లు ఇదుల వెంకటేష్, గోరిగే సతీష్ కుమార్, బాలు

# ఉత్తమ సేవకు అవార్డు అందుకున్న ఎస్సై అజయ్ కుమార్

-77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఎస్పీ, కలెక్టర్ చేతుల మీదుగా సత్కారం
- విధి నిర్వహణలో అంకితభావం, క్రమశిక్షణకు గుర్తింపు




**జనవరి 26 మహా ప్రభ ప్రతినిధి.**
77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని దొరవారిసత్రం మండలంలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న జి అజయ్ కుమార్‌కు ఉత్తమ సేవ అవార్డు దక్కింది. సోమవారం కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో విధి నిర్వహణలో అంకితభావం, క్రమశిక్షణతో పని చేసినందుకు జిల్లా ఎస్పీ సుబ్బరాయలు, కలెక్టర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ఎస్సై అజయ్ కుమార్ ఉత్తమ సేవ అవార్డును అందుకున్నారు. దొరవారిసత్రం మండలంలో విధి నిర్వహణలో ఎక్కడా రాజీ పడకుండా ప్రజలకు న్యాయం చేకూర్చే దిశగా ఎస్సై అజయ్ కుమార్ నిబద్ధతతో పనిచేస్తున్నారని దొరవారిసత్రం ప్రజలు, ప్రముఖులు ప్రశంసించారు. మండలంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతూ శాంతిభద్రతలను సమర్థంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాల నియంత్రణలో కూడా నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ముందుండి పనిచేస్తున్న ఎస్సై అజయ్ కుమార్‌ను "శభాష్" అంటూ మండలంలో అభినందనలు వెలువడుతున్నాయి.

# మల్లుపల్లి గ్రామంలో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవం





**దుబ్బాక - జనవరి 26 (మహాప్రభ)**
సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం మల్లుపల్లి గ్రామంలో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవం చాలా ఘనంగా జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అన్నారు. మల్లుపల్లి గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు ఇవ్వడం జరిగింది. దీనికి దాతలు వెంకటేశ్వర ఇండస్ట్రీస్ రైస్ మిల్ పార్ట్నర్స్ సిశీగోజీ బాలా చారి అండ్ నవీన్ కుమార్ ఉన్నారు. అదేవిధంగా విద్యార్థులకు బ్లాక్ షూ దాతలు 2007 -2008 బ్యాచ్ వారు నవాజ్ శేఖర్ రాజు మధు నరేష్ ఆంజనేయులు లింగం రాము కొండల్ రెడ్డి, మహేష్ బాలరాజు కలసి సోను బహుమతి ఇవ్వడం జరిగింది. విద్యార్థులందరికీ సిద్ది పరిసరాములు గౌడ్ గారు ఎగ్జామ్ ప్యాడ్స్ మరియు పెన్ కిట్ ను బహుమతిగా ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మల్లుపల్లి గ్రామ అభివృద్ధి కమిటీ నుండి మేకల నాగరాజు మాట్లాడుతూ నెక్స్ట్ అకాడమీకి ఇయర్ ప్రారంభించే సమయానికి అందరూ మల్లుపల్లి స్కూల్లోనే చదువుకునే విధంగా చూస్తామని తెలిపారు. మల్లుపల్లి నుండి ప్రైవేట్ స్కూళ్లకు పంపిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ మూడు నెలల్లో మల్లుపల్లి ప్రాథమిక స్కూల్ ని ఇంటర్నేషనల్ స్కూల్ కంటే వసతులను కల్పించి పూర్తిస్థాయిలో మార్చి ఆ తల్లిదండ్రులలో నమ్మకం కలిగించేలా చేస్తామని వారు స్వయంగా నమ్మి ప్రాథమిక పాఠశాలలో చేర్చే విధంగా మనకు నమోదు కల్పిస్తామని తెలిపారు. ఫిబ్రవరి ఫస్ట్ నుంచి మల్లుపల్లి ప్రాథమిక పాఠశాలలో స్కూల్ యూనిఫామ్, స్పోర్ట్స్ డ్రెస్, కరాటే క్లాసెస్, డ్యాన్స్ క్లాసెస్ కొత్తగా ఇద్దరుని విద్య వాలంటరీ మల్లుపల్లి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని తెలిపారు ఇప్పుడు పాఠశాలలో 61 మంది ఉండగా వచ్చే అకాడమిక్ ఇయర్లో దీని 120 కంటే ఎక్కువగా ఉండేటట్టు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు ఎంఈఓ గారు సర్పంచ్ ఉప సర్పంచ్ పాలకవర్గం అండ్ గ్రామ యువకులు పెద్దలు అందరూ పాల్గొన్నారు.

## తెలంగాణ ఉప ముఖ్యమంత్రి ని మర్యాదపూర్వకంగా కలిసిన టి.డబ్ల్యూ.ఎం.చైర్మన్ లక్ పతి కాట్రావత్



**హైదరాబాద్ 26 జనవరి ( మహాప్రభ )**
గణతంత్ర దినోత్సవం సందర్భంగా తెలంగాణ ఉప ముఖ్యమంత్రి ని మర్యాదపూర్వకంగా కలిసిన టి.డబ్ల్యూ.ఎం.చైర్మన్ లక్ పతి కాట్రావత్, టి.డబ్ల్యూ.ఎం, సి.ఎం.ఓ పాయేటి బాబా వలి గారు మరియు టి.డబ్ల్యూ.ఎం. మీడియా ఇంచార్జి గిరి దర్శనం కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

## ఉత్తమ సబర్డినేటర్ గా ప్రశంస పత్రాలు అందుకున్న మల్లేష్


**వెల్దండ - జనవరి 26 ( మహాప్రభ )**



వెల్దండమండల కేంద్రంలో తాసిల్దార్ కార్యాలయంలో సబార్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్న మల్లేష్ కి 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా, ఉత్తమ సభా ర్డినేటర్ గా ప్రశంస పత్రాన్ని అందజేసిన నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, చేతుల మీదుగా అందజేశారు. ఉత్తమ సబర్డినేటర్గా గుర్తించి ప్రశంస పత్రాన్ని అందజేసిన ఎంపీ మల్లు రవి,నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో జాతీయ జెండాకు అవమానం

గణతంత్ర దినోత్సవ వేడుకల రోజు మచ్చ తలకిందులుగా జాతీయ జెండా ప్రజల్లో ఆగ్రహం




**జనవరి 26 (సూళ్లూరుపేట)మహా ప్రభ.**
సూళ్లూరుపేట పట్టణంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా చోటుచేసుకున్న ఘటన కలకలం రేపింది. పట్టణంలోని చందన షాపింగ్ మాల్ ముందు ఎగరవేసిన జాతీయ జెండా తలకిందులుగా తిరగబడి ఉండడాన్ని స్థానికులు గమనించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.
దేశ గౌరవానికి ప్రతీకగా భావించే జాతీయ పతాకాన్ని గౌరవించాల్సిన అత్యంత ముఖ్యమైన రోజున ఇలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోవడం పట్ల పట్టణ ప్రజలు విచారం వ్యక్తం చేశారు. బాధ్యత కలిగిన వారు కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వెల్లువెత్తింది. దీనిపై స్పందించిన స్టోర్ మేనేజర్ పి భరత్ కుమార్, ఇది పనిచేసే స్టాఫ్ నలుగురు కట్టారు అది కొద్దిగా హడావిడిగా కట్టిన దానివల్ల ఇలా జరిగింది. దీనికి అందరం బాధ్యత వహిస్తూ క్షమాపణ తెలిపారు.

# బిజినెస్

## మహిళలకు భారీ షాక్..
## బంగారం రికార్డ్.. రూ.4 లక్షల చేరువలో వెండి!

గణతంత్ర దినోత్స వేడుకల రోజులు బంగారం, వెండి ధరలు భారీ షాకిచ్చాయి. బంగారం, వెండి ధరలు అంటేనే గుండె గుబేల్‌మనేలా ఉంటున్నాయి. అయితే ప్రతి రోజు ఉదయం బంగారం, వెండి ధరలు అప్‌డేట్ అవుతుంటాయి. ఉదయం10 నుంచి 11 గంటల మధ్య ఓసారి అప్‌డేట్ అవుతుంటాయి. ఈ నేపథ్యంలో తాజాగా బంగారం ధర భారీగా పెరిగింది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై ఏకంగ ఆరూ.2,450, అదే 22 క్యారెట్ల 10 గ్రాములపై 2250 మేర పెరిగింది. ఇక వెండి విషయానికొస్తె కిలో గ్రాముపై ఏకంగా రూ.5000 వరకు ఎగబాకిందిఉదయం 6 గంటల సమాయానికి బంగారం ధరల్లో కేవలం 10 రూపాయలు మాత్రమే స్వల్పంగా తగ్గుముఖం ఉండగా, ఇప్పుడు వేలల్లో పెరిగడం ఆందోళన కలిగిస్తోంది.ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,62,710 ఉండగా, 22 క్యారెట్ల ధర రూ.1,49,150 వద్ద ట్రేడవుతోంది. ఇక కిలో వెండి ధర రూ.3,75,000 వద్ద ట్రేడవుతోంది.




మరికొన్ని రోజుల్లో 4 లక్షల రూపాయలకు చేరుకునే అవకాశం ఉంది.ప్రస్తుతం హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,62,710 ఉండగా, 22 క్యారెట్ల ధర రూ.1,149,150 ఉంది. అలాగే 18 క్యారెట్ల ధర రూ.1,22,030 వద్ద ట్రేడవుతున్నాయి.ప్రపంచంలో రాజకీయ గందరగోళం పెరిగిన వేళ, బంగారం ధరలు సరికొత్త రికార్డును సృష్టిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా గందరగోళ పరిస్థితులు పెరగడంతో బంగారం ధర 5,000 డాలర్ల స్థాయిని దాటింది. గత రెండు సంవత్సరాల్లో బంగారం ధర రెండింతలకుపైగా పెరగడం మార్కెట్లలో భయాన్ని కొలిచే సాధనంగా బులియన్‌కు ఉన్న చారిత్రక పాత్రను మరోసారి గుర్తు చేసింది. బులియన్ ధర సుమారు 5,040 డాలర్లకు చేరింది.

## రూపాయి పతనంపై దిగుమతిదారుల బెంబేలు



న్యూఢిల్లీ: డాలర్‌తో రూపాయి పతనం ఆర్థికవేత్తలతో పాటు ప్రభుత్వాన్నీ కలవర పరుస్తోంది. శుక్రవారం డాలర్‌తో రూపాయి మారకం రేటు గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.92 స్థాయికి పడిపోయింది. దీంతో మన దేశానికి ప్రధాన దిగుమతులపైన ముడి చమురు, బంగారం, వెండి, వంటనూనెలు, రసాయన ఎరువులు, ఎలక్ట్రానిక్ వస్తువుల దిగుమతులు మరింత భారం కానున్నాయి. విదేశీ విద్య, విదేశీ ప్రయాణాలపైనా మరింత ఖర్చు చేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితి దేశంలో ద్రవ్యోల్బణం పెరుగుదలకు దారితీస్తుందని ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎగుమతిదారులకు లాభం: డాలర్‌తో రూపాయి పతనంపై దిగుమతిదారులు లబోదిబో మంటుంటే, ఎగుమతి కంపెనీలు మాత్రం ఖుషీ ఖుషీగా ఉన్నాయి. దీంతో తాము అందుకునే డాలర్లకు మరిన్ని రూపాయలు సొమ్ము చేసుకోవచ్చని భావిస్తున్నాయి. అయితే ప్రధాన ముడి పదార్థాల కోసం ఎక్కువగా దిగుమతులపై ఆధారపడిన ఎగుమతిదారులకు మాత్రం ఈ విషయంలో పెద్దగా లాభం ఉండకపోవచ్చని భావిస్తున్నారు. ట్రంప్ సుంకాలతో చతికిల పడిన వస్త్ర, ఆభరణ, మత్స్య ఎగుమతులకూ కూడా రూపాయి పతనం పెద్దగా లాభించక పోవచ్చని అంచనా. అయితే ఐటీ కంపెనీలకు మాత్రం ఇది బాగానే కలిసి వస్తుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

## గుడ్‌న్యూస్.. భారీగా తగ్గనున్న ఈ కంపెనీ కార్ల ధరలు!
### కొత్త కార్ కొనాలనుకునేవారికి పండగే

కొత్త కారు కొనాలని ప్లాన్ చేస్తున్నారా? అయితే మీకో అదిరిపోయే శుభవార్త. కొన్ని కంపెనీల ధరలు భారీగా తగ్గే అవకాశం ఉంది. అందుకు కారణం భారత్, యూరప్‌తో చేసుకునే ఒప్పందాలే. భారత్, యూరప్ మధ్య జరుగుతున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద చర్చలు ఇప్పుడు కీలక దశలో ఉన్నాయి. EU నుండి దిగుమతి చేసుకునే కార్లపై సుంకాలను 110 శాతం నుండి 40 శాతానికి తగ్గించాలని భారత్ యోచిస్తున్నట్లు వర్గాల సమాచారం. ఈ పథకం కింద 27 యూరోపియన్ యూనియన్ దేశాల నుండి ఎంపిక చేసిన వాహనాలపై పన్నులను వెంటనే తగ్గించడానికి ప్రభుత్వం అంగీకరించిందని రెండు వర్గాలు రాయిటర్స్‌కు





తెలిపాయి . సుమారు 1.626 మిలియన్ల యూరోల కంటే ఎక్కువ దిగుమతి ధర కలిగిన వాహనాలకు వర్తిస్తాయని గమనించాలి. ఈ ప్రభుత్వ నిర్ణయం యూరోపియన్ కార్ల తయారీదారులకు భారత్‌లో వేరే కార్ల కంపెనీలతో పోటీ పడేందుకు మెరుగైన అవకాశాన్ని అందిస్తుంది. అయితే ఈ 40 శాతం పన్నును కూడా క్రమంగా 10 శాతానికి తగ్గించే ప్రణాళికలు ఉన్నాయి. భారత ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వోక్స్‌వ్యాగన్, మెర్సిడెస్-బెంజ్, దీవీఔ వంటి యూరోపియన్ ఆటోమొబైల్ కంపెనీలకు లాభం చేకూర్చనుంది. అలాగే వీటి ధరలు ఇండియాలో భారీగా తగ్గే అవకాశం ఉంది. ఇప్పటివరకు అధిక రేట్లు కంపెనీలకు తలనొప్పిగా ఉన్నాయి, కానీ ప్రభుత్వ నిర్ణయం గణనీయమైన ఉపశమనం కలిగించవచ్చు.

# స్పోర్ట్స్

## డబ్ల్యూపీఎల్‌లో తొలి శతకం..
## చరిత్ర సృష్టించిన ముంబై హిట్టర్..!

మహిళల ప్రీమియర్ లీగ్‌లో ముంబై ఇండియన్స్ బ్యాటర్ నాట్‌సీవర్ బ్రంట్ (చీఫ్ గా౩అజవతీ దీతీబత్) చరిత్ర సృష్టించింది. డబ్ల్యూపీఎల్‌లో మొట్టమొదటి శతకంతో బ్రంట్ రికార్డు నెలకొల్పింది. చావోరేవో పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (=జదీ) బౌలర్లపై బౌండరీల మోతతో విరుచుకుపడిన ఆమె.. సెంచరీతో భారీ స్కోర్ అందించింది. తనమార్క్ విధ్వంసంతో ఆర్సీబీకి చుక్కలు చూపించిన తను.. 19వ ఓవర్లో సింగిల్ తీసి వంద పూర్తి చేసుకుంది.టీ20ల్లో దూకుడైన ఆటతో చెలరేగే నాట్ సీవర్ బ్రంట్ ఈసారి మహిళల ప్రీమియర్ లీగ్‌లో రెచ్చిపోయింది. గత మూడు సీజన్లుగా ముంబై విజయాల్లో కీలకమవుతున్న ఆమె గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో శతకంతో గర్జించింది. తద్వారా ఈ లీగ్ చరిత్రలో మూడంకెల స్కోర్ సాధించిన తొలి బ్యాటర్‌గా రికార్డు పుస్తకాల్లో చేరింది.ఇప్పటివరకూ




జార్జియా వోల్(యూపీ వారియర్స్ తరఫున) 99 నాటౌట్ అత్యధిక వ్యక్తిగత స్కోర్‌గా ఉండేది. కానీ.. బ్రంట్ 59 బంతుల్లో 16 ఫోర్లు, ఒక సిక్సర్‌తో అజేయంగా నిలిచి ముంబైకి భారీ స్కోర్ కట్టబెట్టింది. తన శతకాన్ని భాగస్వామి క్యాథరీన్ సీవర్ బ్రంట్, కుమారుడికి అంకితం చేసిందీ ఇంగ్లండ్ స్టార్.

డబ్ల్యూపీఎల్‌లో అత్యధిక స్కోర్లు..

100 నాటౌట్ నాట్‌సీవర్ బ్రంట్(ముంబై ఇండియన్స్) VS ఆర్సీబీ, వడోదర 2026,

99 నాటౌట్ జార్జియా వోల్(యూపీ వారియర్స్) VS ఆర్సీబీ, లక్నో 2025

99 సోఫీ డివినె (ఆర్సీబీ) VS గుజరాత్, బ్రబోర్న్ 2023

96 నాటౌట్ అలీసా హీలీ(యూపీ వారియర్స్) VS ఆర్సీబీ, బ్రబోర్న్ 2023

96 నాటౌట్ బేత్ మూనీ (గుజరాత్ జెయింట్స్) VS యూపీ వారియర్స్, లక్నో 2025

96 స్మృతి మంధాన (ఆర్సీబీ) VS ఢిల్లీ క్యాపిటల్స్, ముంబై డీవై పాటిల్ స్టేడియం 2026

## చివరి 2 టీ20లకు తిలక్ వర్మ దూరం..




తెలుగు తేజం, టీమిండియా స్టార్ బ్యాటర్ తిలక్ వర్మ మరికొన్ని రోజులు విశ్రాంతి తీసుకోనున్నాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న సిరీస్‌లో చివరి రెండు టీ20లకు అతడు అందుబాటులో ఉండదని బీసీసీఐ సోమవారం ధృవీకరించింది. జనవరి 7న రాజ్‌కోట్‌లో వైద్య పరీక్షలు చేయించుకున్న 23 ఏళ్ల తిలక్ వర్మ పూర్తి ఫిట్‌నెస్ సాధించడానికి మరింత సమయం పడుతుంది. తిలక్ వర్మ ఇటీవల జనవరి 7న రాజ్‌కోట్‌లో పొత్తికడుపు సమస్యతో చిన్న సర్జరీ చేయించుకున్నాడు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడు. తిలక్ ఆరోగ్యంగానే ఉన్నాడు. కానీ ఫిజికల్ ఫిట్‌నెస్ కోసం అతడు కొన్ని రోజులు మ్యాచ్‌లు ఆడే అవకాశం లేదు. టీ20 వరల్డ్ కప్ కోసం అతడు మరింత ఫిట్, ఆరోగ్యంగా ఉండాలని భావించిన బీసీసీఐ మేనేజ్‌మెంట్, కోచ్ తిలక్ వర్మకు విశ్రాంతినిచ్చారు. ఫిబ్రవరిలో జరగనున్న ప్రపంచ కప్ కోసం ప్రస్తుతం న్యూజిలాండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్ చివరి రెండు మ్యాచ్‌లకు సైతం అతడు అందుబాటులో ఉండడని తెలిపారు. భారత అభిమానులకు శుభవార్త. తిలక్ వర్మ ఫిబ్రవరి 3న ముంబైలో జాతీయ జట్టుతో కలవనున్నాడు. ఫిబ్రవరి 7న ప్రారంభమయ్యే 2026 ఐసిసి పురుషుల టీ20 ప్రపంచ కప్‌కు ముందు జరిగే వార్మప్ మ్యాచ్‌లకు స్టార్ బ్యాటర్ అందుబాటులో ఉంటాడని తెలుస్తుంది. "తిలక్ వర్మ జనవరి 7, బుధవారం నాడు రాజ్‌కోట్‌లో పొత్తికడుపు సమస్య రావడంతో శస్త్రచికిత్స చేయించుకున్నాడు. గురువారం ఉదయం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాడు. తరువాత శుక్రవారం హైదరాబాద్‌కు తిరిగి వెళ్లాడు. ప్రస్తుతం తిలక్ ఆరోగ్యంగా ఉన్నాడు. వేగంగా కోలుకుంటున్నాడు' అని బీసీసీఐ గతంలో ఒక అప్‌డేట్‌లో తెలిపింది. పూర్తిగా కోలుకోవడంతో పాటు ఫిట్ నెస్ ముఖ్యమని, త్వరలో అతడు జట్టుతో కలుస్తాడని బీసీసీఐ పేర్కొంది. తిలక్ దూరం కావడంతో, న్యూజిలాండ్ సిరీస్‌లో మిగిలిన మ్యాచ్‌లకు అతని స్థానంలో శ్రేయాస్ అయ్యర్‌ను కొనసాగించాలని సీనియర్ మెన్ సెలక్షన్ కమిటీ సిఫార్సు చేసింది. అయ్యర్ సిరీస్ లో కొనసాగనున్నాడు. జట్టు యాజమాన్యం ఇషాన్ కిషన్‌ను నెం. 3 స్థానంలో బ్యాటింగ్ చేపిస్తుంది. అయితే మొదటి మూడు మ్యాచ్‌ల్లో పూర్తిగా విఫలం కావడంతో సంజూ శాంసన్ పై ఒత్తిడి పెరిగింది. చివరి రెండు టీ20ల్లోనూ సంజూ ఇలాగే ఆడితే టీ20 వరల్డ్ కప్ లో శాంసన్ తుది జట్టులో ఉండటం కష్టమే. ఇషాన్ కిషన్ అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాడు.

## ఫిబ్రవరి 2 లోపు చెప్తాం..!

### టీ20 ప్రపంచకప్‌లో పాల్గొనడంపై పాక్ సస్పెన్స్

**లాహోర్:**
టీ20 ప్రపంచకప్ నుంచి బంగ్లాదేశ్‌ను బహిష్కరించడానికి వ్యతిరేకంగా గళం వినిపిస్తున్న పాకిస్థాన్ క్రికెట్ జట్టు.. ఈ టోర్నీలో ఆడాలా? వద్దా? అన్నదానిపై మరో వారం రోజుల్లో తేల్చుకోనుంది. ఈ మేరకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) అధ్యక్షుడు మోహ్సిన్ నఖ్వీ.. సోమవారం లాహోర్‌లో ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్‌ను కలిసిన అనంతరం ఎక్స్ వేదికగా స్పందించారు. ట్వీట్‌లో నఖ్వీ.. 'బంగ్లాదేశ్ విషయంలో ఐసీసీ వ్యవహరించిన తీరుపై ప్రధానితో సమావేశమై సుదీర్ఘంగా




చర్చించాం.అందుబాటులో ఉన్న అవకాశాలను ఉపయోగించుకుని దీనిపై నిర్ణయం తీసుకోవాలని ఆయన ఆదేశించారు. రానున్న శుక్రవారం లేదా సోమవారం లోపు తుది నిర్ణయాన్ని వెల్లడిస్తాం' అని తెలిపాడు. బంగ్లాకు మద్దతుగా టీ20 ప్రపంచకప్‌నకు పూర్తిగా జట్టును పంపకుండా ఉండటమా? లేక ఫిబ్రవరి 15న కొలంబోతో దాయాది భారత్‌తో జరిగే ఒక్క మ్యాచ్‌ను బహిష్కరించాలా? అన్నదానిపై నఖ్వీ, ప్రధానితో చర్చించినట్టు తెలుస్తున్నది. మరి దీనిపై పాక్ ప్రభుత్వం, పీసీబీ ఏ నిర్ణయం తీసుకుంటుందనేది ప్రస్తుతానికైతే సస్పెన్సే!





# మంచు మనోజ్ నుంచి మరో పవర్ ఫుల్ ట్రాన్స్‌ఫర్మేషన్..
# 'డేవిడ్ రెడ్డి' ఫస్ట్ లుక్‌తో హై వోల్టేజ్ హైప్

'బైరవం', 'మిరాయ్' లాంటి సక్సెస్‌లతో మళ్లీ ఫుల్ ఫామ్‌లోకి వచ్చిన మంచు మనోజ్.. ఇప్పుడు కెరీర్‌లోనే అత్యంత ఇంటెన్స్ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. పీరియడ్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాకు 'డేవిడ్ రెడ్డి' అనే టైటిల్ ఖరారైంది. తాజాగా రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ సినిమాపై ఒక్కసారిగా అంచనాలు పెంచేసింది. హనుమరెడ్డి యక్కంటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మంచు మనోజ్ లుక్ పూర్తిగా షాక్ ఇచ్చేలా ఉంది. చేతిలో ఆయుధం, కళ్లలో ప్రతీకారం, ముఖంలో క్రూరత్వంఉ ఓ భారీ యాక్షన్ సీన్ బ్యాక్‌డ్రాప్‌లో కనిపించిన మనోజ్ ఫస్ట్ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ఈ లుక్‌ను షేర్ చేస్తూ మనోజ్ "ఇది నాలో ఇప్పటివరకూ బయటకు రాని ఒక వైపు. ఎలాంటి కరుణ లేని పాత్ర" అంటూ ఆసక్తికర క్యాప్షన్ ఇచ్చారు. 'డేవిడ్ రెడ్డి' కథ బ్రిటీష్ పాలన కాలంలో జరుగుతుంది. 1897 నుంచి 1922 మధ్య జరిగిన సంఘటనల ఆధారంగా ఈ కథను రూపొందించారు. హీరో పాత్ర ఫిక్షనల్ అయినప్పటికీ, సామాజిక అణచివేతలు, కుల వివక్ష, బ్రిటీష్ అణచివేతకు ఎదురొడ్డి నిలబడిన ఓ రెబల్ యోధుడి ప్రయాణమే ఈ సినిమా మూలకథ. స్వాతంత్ర్యం అడిగి కాదు.. పోరాడి తెచ్చుకోవాలి అనే సిద్ధాంతంతో ముందుకెళ్లే పాత్రగా మనోజ్ కనిపించనున్నారు. ఈ సినిమాలో మనోజ్ వాడే భారీ బైక్ 'వార్ డాగ్' ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. దాదాపు 700 కేజీల బరువు ఉన్న ఈ బైక్‌తో పాటు, ఆయన చేతిలో ఉండే స్టిక్‌ను 'డెత్ నోట్'గా వర్ణిస్తున్నారు. ఇవే డేవిడ్ రెడ్డి ప్రధాన ఆయుధాలు అని దర్శకుడు వెల్లడించారు. వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్ బ్యానర్‌పై మోతుకూరి భరత్, నల్లగంగుళ వెంకట్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హీరోయిన్‌గా మరియా నటిస్తున్నారు. తెలుగు తో పాటు హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో సినిమాను రిలీజ్ చేయనున్నారు. చరిత్ర పుస్తకాల్లో కనిపించని కొన్ని దారుణ సంఘటనలు, వాటిని ఎదుర్కొనేందుకు ఒక వ్యక్తి ఎంత తీవ్రంగా పోరాడితే ఎలా ఉంటుందనే అంశాన్ని 'డేవిడ్ రెడ్డి' చూపించనుందని మనోజ్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఫస్ట్ లుక్‌తోనే ఆ మాటలకు బలం చేకూరింది. మొత్తానికిడ మంచు మనోజ్ కెరీర్‌లోనే మోస్ట్ వైలెంట్, మోస్ట్ ఇంటెన్స్ పాత్రగా 'డేవిడ్ రెడ్డి' నిలవబోతోందన్నది ఫస్ట్ లుక్ చూస్తే స్పష్టంగా అర్థమవుతోంది.



# హాట్ ఫోజుల్లో నేహా శెట్టి..

# రవితేజకు కొత్త ఆశలు రేపుతున్న 'ఇరుముడి'
## డివోషన్ టచ్‌తో మాస్ మహారాజ్ రీబూట్?




మాస్ మహారాజ్ రవితేజ కెరీర్ గత కొన్నేళ్లుగా ఆశించిన స్థాయిలో సాగడం లేదు. వరుసగా సినిమాలు చేస్తున్నప్పటికీ, ప్రేక్షకుల్లో ఆ సినిమాలు పూర్తి సంతృప్తిని కలిగించలేకపోయాయి. మాస్ ఇమేజ్‌కు కాస్త విరామం ఇచ్చి, క్లాస్ టచ్‌తో చేసిన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' కూడా సంక్రాంతి బరిలో పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. దీంతో రవితేజ తదుపరి ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ క్రమంలోనే ఆయన దర్శకుడు శివ నిర్వాణతో చేతులు కలిపారు. ఈ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఇరుముడి'. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా నుంచి గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. అయ్యప్ప స్వామి మాలధారణలో రవితేజ కనిపించిన లుక్ సోషల్ మీడియాలో మంచి స్పందన తెచ్చుకుంది. పోస్టర్ చూసిన వెంటనే ఒక డివోషనల్ ఫీల్, పాజిటివ్ వైబ్స్ కలుగుతున్నాయన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. అయ్యప్ప మాలధారణలో ఇరుముడికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యతను ఈ సినిమాలో ఎమోషనల్‌గా, డీప్‌గా చూపించబోతున్నారని సమాచారం. సెన్సిటివ్, క్లాస్ కథనాలతో పేరు తెచ్చుకున్న శివ నిర్వాణ ఈసారి డివోషనల్ టచ్‌తో కథను తెరకెక్కిస్తుండటంతో అంచనాలు మరింత పెరిగాయి. మాస్‌కు భిన్నంగా, కంటెంట్ ఓరియెంటెడ్ సినిమా ద్వారా రవితేజ కొత్త ఇమేజ్‌ను ఆవిష్కరించబోతున్నారనే టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రానికి జీ.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఇక అయ్యప్ప మాలధారణ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని, 2026 ఎండింగ్‌లో సినిమాను విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద 'ఇరుముడి' రవితేజ కెరీర్‌కు టర్నింగ్ పాయింట్ అవుతుందా? అనే ఆసక్తి ఇండస్ట్రీలోనూ, అభిమానుల్లోనూ పెరుగుతోంది.

## క్రేజీ మూవీలో ఛాన్స్ కొట్టేసింది?



ఇంట గెలిచి రచ్చ గెలవాలంటారు పెద్దలు. కానీ రచ్చ గెలిచి, తర్వాత ఇంటిని కూడా గెలిచి భళా అని పించుకున్న తెలుగు సోయగం శ్రీలీల. తొలుత కన్నడంలో గెలిచి, తర్వాత తెలుగులో నిలిచి.. ఇప్పుడు హిందీ, తమిళం అన్నింటినీ కవర్ చేస్తూ.. జాతీయ స్థాయిలో గుర్తింపుకై ప్రయత్నాలు చేస్తున్నది ఈ అందాలభామ. తాజాగా ఈ తెలుగమ్మాయి డైరీలో ఓ ప్రతిష్టాత్మక చిత్రం వచ్చి చేరిందని వినికిడి. కోలీవుడ్ సన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ స్వీయ దర్శకత్వంలో ఓ సైన్స్‌ఫిక్షన్ సినిమా చేస్తున్నారు. ఆ సినిమాలోని ఇద్దరు కథానాయికల్లో ఒకరిగా శ్రీలీల ఎంపికైందని కోలీవుడ్ న్యూస్. ఇటీవలే శ్రీలీలకు ప్రదీప్ కథ వినిపించాడని, పాత్ర నచ్చడంతో శ్రీలీల పచ్చజెండా ఊపేసిందని తెలిసింది. రీసెంట్‌గా 'పరాశక్తి'తో తమిళ ప్రేక్షకుల్ని పలకరించిన శ్రీలీలకు అక్కడ నిరాశే ఎదురైంది. ఈ సారి పరాజయం ఎరుగని ప్రదీప్ రంగనాథన్‌తో రాబోతున్నది శ్రీలీల. ఫలితం ఎలా ఉంటుందో చూడాలి.



# ఐటం పాటల ట్రెండ్‌కు బ్రేక్..
## రష్మిక మందన్నా పెట్టిన షరతులు ఇప్పుడు హాట్ టాపిక్

ఒకప్పుడు సినిమాల్లో ఐటం పాట అంటే ప్రత్యేకంగా ప్రొఫెషనల్ డాన్సర్లే గుర్తొచ్చేవారు. ఆ పాటల్లో వాళ్లు కనిపిస్తేనే హిట్ అనే స్టాండర్డ్ ఉండేది. కానీ కాలం మారింది. ఇప్పుడు అదే సినిమాలో హీరోయిన్‌గా నటించిన నటీమణులే ఐటం సాంగ్స్‌లోనూ స్టెప్పులేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ఒకే సినిమాలో హీరోయిన్ పారితోషికంతో పాటు స్పెషల్ సాంగ్ ఫీజు కూడా అందుకుంటూ డబుల్ లాభం పొందుతున్నారు. ఈ ట్రెండ్‌కు అనుగుణంగానే గత కొన్నేళ్లుగా సమంత, కాజల్ అగర్వాల్, తమన్నా, పూజా హెగ్డే, శ్రీలీల వంటి స్టార్ హీరోయిన్లు ఐటం పాటల్లో కనిపించి సెన్సేషన్ క్రియేట్ చేశారు. టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌లోనూ ఇదే ట్రెండ్ బలంగా కొనసాగుతోంది. ముఖ్యంగా పెద్ద సినిమాల్లో ఐటం సాంగ్ అంటే స్టార్ హీరోయిన్ ఉండాల్సిందే అనే పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలోనే 'నేషనల్ క్రష్'గా గుర్తింపు పొందిన రష్మిక మందన్నా కూడా ఈ దారిలోకి అడుగుపెట్టింది. బాలీవుడ్ డెబ్యూ 'గుడ్‌బై'లో నటిగా మెప్పించిన ఆమె, తర్వాత వచ్చిన 'థామా' చిత్రంలో నటనతో పాటు స్పెషల్ సాంగ్‌లోనూ తనదైన స్టైల్‌లో ఆకట్టుకుంది. ఆ పాట తర్వాత రష్మికపై ఐటం భామగా కూడా డిమాండ్ పెరిగింది. దర్శక, నిర్మాతలు "హీరోయిన్‌గా తీసుకున్నా, ఐటం సాంగ్‌కు కూడా ఒప్పించొచ్చు" అనే ధీమాతో ఆమె వైపు చూస్తున్నారనే టాక్ వినిపించింది. కానీ ఇదే సమయంలో రష్మిక ఒక కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. తాను నటిగా అయినా, ఐటం భామగా అయినా కేవలం ఇద్దరు దర్శకుల సినిమాల్లో మాత్రమే స్పెషల్ సాంగ్స్ చేస్తానని, అంతకుమించి ఈ విషయంలో చాలా సెలెక్టివ్‌గా ఉంటానని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఆ ఇద్దరు దర్శకులు ఎవరో మాత్రం ఇప్పుడే వెల్లడించలేనని, సరైన సమయంలో తానే చెబుతానని చెప్పిందట. దీంతో రష్మిక ఐటం పాటల విషయంలో స్పష్టమైన హద్దులు పెట్టుకున్నారనే చర్చ మొదలైంది. ఈ నిర్ణయం టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా రష్మికపై భారీ ఆశలు పెట్టుకున్న కొంతమంది దర్శకులు ఈ షరతులతో కాస్త నిరాశకు గురైనట్లు సమాచారం. పాన్ ఇండియా స్థాయిలో ఆమెకు ఉన్న క్రేజ్‌ను ఎన్‌క్యాష్ చేసుకోవాలని చాలామంది ప్లాన్స్ వేస్తుండగా, ఈ కండీషన్ వాళ్లకు షాక్ ఇచ్చిందని టాక్. అయితే రష్మిక మాత్రం ప్రస్తుతం ఫుల్ బిజీగా ఉంది. తెలుగులో లేడీ ఓరియెంటెడ్ సినిమా 'మైసా'లో కీలక పాత్రలో నటిస్తుండగా, విజయ్ దేవరకొండ 14వ సినిమాలోనూ హీరోయిన్‌గా ఎంపికైంది. మరోవైపు బాలీవుడ్‌లో 'కాక్‌టెయిల్ 2' వంటి పెద్ద ప్రాజెక్ట్‌లో నటిస్తోంది. నటిగా, డాన్సర్‌గా తనను తాను విభిన్నంగా ప్రెజెంట్ చేసుకుంటూనే, అవసరమైతేనే ఐటం పాటలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలన్నదే రష్మిక స్ట్రాటజీగా కనిపిస్తోంది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com